


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 356 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : విశాఖపట్నం | బుధవారం 26 ఆగస్టు 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :356 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : VISAKHAPATNAM | WED 26 AUGUST 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతను కాపాడండి..
# వైసీపీ డ్రామాలను నమ్మొద్దు: లోకేశ్

- రాయదుర్గం నియోజకవర్గం కనేకల్ మండలం నల్లంపల్లిలో కార్యకర్తల సమావేశం
- హాజరైన టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్
- కూటమిలో విభేదాలు సృష్టించే ప్రయత్నాలపై అప్రమత్తంగా ఉండాలని పిలుపు
- కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఇస్తామని హామీ
- పులివెందుల ప్రజల కోసమైనా జగన్ అసెంబ్లీకి రావాలని సవాల్
- కణేకల్‌కు డిగ్రీ కళాశాల మంజూరు బాధ్యత తనదేనని ప్రకటన

పెన్ పవర్ డెస్క్:రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కూటమి శ్రేణులు సమష్టిగా పనిచేయాలని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని, కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు, గౌరవం కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలోని

- మిగతా 2లో




# రాయలసీమకు సుజ్లాన్ భరోసా..
## రూ.10 వేల కోట్ల ప్రాజెక్టుకు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన

- రాయదుర్గంలో సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన
- రూ.10,000 కోట్ల పెట్టుబడితో 1,325 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం
- ప్రాజెక్టు ద్వారా 4,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు
- మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా కొత్త బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్ ప్రారంభం
- అనంత, ఉరవకొండ, కల్యాణదుర్గం నియోజకవర్గాల్లో ప్రాజెక్టుల ఏర్పాటు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన రంగం కొత్త ఊపు అందుకుంది. పవన విద్యుత్ రంగంలో రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి తరలివచ్చింది. అనంతపురం జిల్లా, రాయదుర్గం నియోజకవర్గంలో ప్రఖ్యాత సుజ్లాన్ సంస్థ రూ.10,000 కోట్ల భారీ పెట్టుబడితో నెలకొల్పనున్న విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 4,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాయదుర్గం నియోజకవర్గంలోని కనేకల్లు మండలం, హులికెర గ్రామం వద్ద ఈ భారీ ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. మొత్తం 1,325 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్న ఈ పవన విద్యుత్ ప్రాజెక్టులను రాయదుర్గం, ఉరవకొండ, కల్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, సుజ్లాన్ సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన ఎ144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్'ను కూడా మంత్రి లోకేశ్ అధికారికంగా ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ప్రాజెక్టుకు సంబంధించిన ఆడియో విజువల్ (ఏవీ) ప్రదర్శనను వీక్షించారు. అంతకుముందు బళ్లారి సమీపంలోని

- మిగతా 2లో



# బీసీలపై కక్ష సాధింపు వైసీపీదే.. మాది కాదు

- అవినీతి కేసులను బీసీలపై కక్షగా వైసీపీ చిత్రీకరిస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శ
- గత ప్రభుత్వంలో తనతో పాటు బీసీ నేతలపై పెట్టిన అక్రమ కేసులను గుర్తు చేసిన అచ్చెన్న
- బీసీ రిజర్వేషన్లను 34% నుంచి 24%కి తగ్గించిందీ వైసీపీయేనని ఆరోపణ
- చంద్రబాబు నాయకత్వంలోనే బీసీలకు ఆర్థిక, రాజకీయ సాధికారత అని వ్యాఖ్య
- రిజర్వేషన్ల పునరుద్ధరణపై న్యాయపరంగానూ పోరాడతామని స్పష్టీకరణ

- మిగతా 2లో



## గోదావరి పుష్కరాలపై సీఎం చంద్రబాబు సమీక్ష..
# ఏర్పాట్లు అద్భుతంగా ఉండాలి!

- గోదావరి పుష్కరాల పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- వచ్చే ఏడాది జూన్ 26 నుంచి 12 రోజుల పాటు పుష్కరాల నిర్వహణ
- రూ.4,026 కోట్ల అంచనాతో 4,932 పనుల పురోగతిపై చర్చ
- భక్తులకు ప్రపంచస్థాయి వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశం
- పుష్కరాల నిర్వహణలో స్థానిక ప్రజల భాగస్వామ్యం పెంచాలని సూచన

పెన్ పవర్ డెస్క్:వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను చరిత్రలో నిలిచిపోయేలా అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దేశ, విదేశాల నుంచి తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఏర్పాట్లు చేయాలని ఆయన స్పష్టం చేశారు. పుష్కరాల పనుల పురోగతిపై సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, 2025 జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు జరిగే ఈ మహా వేడుకలను విజయవంతం చేసేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. రవాణా, పారిశుద్ధ్యం, నిరంతరాయ తాగునీటి సరఫరా, వైద్య సేవలు, భద్రత, వసతి కల్పనలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. పుష్కరాల నిర్వహణ అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా, స్థానిక ప్రజలను భాగస్వాములను చేయడం ద్వారా ఒక ప్రజా ఉద్యమంలా

- మిగతా 2లో



## రేవంత్ రెడ్డితో దేశ భద్రతకు ముప్పు..
## ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు

- దేశ వ్యతిరేక శక్తులతో రేవంత్ రెడ్డి చేతులు కలుపుతున్నారన్న అర్వింద్
- దేశంపై విషం చిమ్మే వారితో మాట్లాడి రాజకీయ లబ్ధి పొందేందుకు యత్నిస్తున్నారని వ్యాఖ్య
- కేసీఆర్ కంటే రేవంత్ రెడ్డి ప్రమాదకరమైన వ్యక్తి అని వ్యాఖ్య
- ఇకపై రేవంత్ ప్రతి కదలిక జాతీయ భద్రతా సంస్థల పరిశీలనలో ఉంటుందని వెల్లడి

- మిగతా 2లో

# ఏపీ లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జునరావు ప్రమాణ స్వీకారం..

## హాజరైన సీఎం చంద్రబాబు

- ఆంధ్రప్రదేశ్ నూతన లోకాయుక్తగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ మల్లిఖార్జునరావు
- విజయవాడలో ఆయనతో ప్రమాణం చేయించిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరు

- మిగతా 2లో




## స్థానిక ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే
# వైసీపీదే విజయం

- స్థానిక ఎన్నికలు కేవలం గెలుపోటములకు మాత్రమే సంబంధించినవి కావన్న జగన్
- క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన సమయమని వ్యాఖ్య
- కుటుంబ సభ్యులను బరిలోకి దించేందుకు వెనుకాడవద్దని పిలుపు
- పోటీలు లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని హెచ్చరిక
- పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగితే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తారని వైసీపీ అధినేత జగన్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ముఖ్యనేతలతో ఈరోజు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, రాబోయే స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకు సంబంధించినవి మాత్రమే కావని... క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా

- మిగతా 2లో





## ఆరోగ్యం క్షీణించడంతో దీక్ష విరమించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు డిమాండ్‌గా 48 గంటల దీక్షకు పిలుపు
- రక్తపోటు పడిపోవడంతో రెండో రోజే దీక్షను ముగించాలని సూచించిన సీనియర్ నేతలు
- నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేసిన ఎంపీ కె. లక్ష్మణ్
- రూ.15,000 కోట్ల బకాయిలతో 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారమన్న బీజేపీ

- మిగతా 2లో




## కొండా సురేఖ మాజీ ఓఎస్డీ కేసు:
# జూబ్లీహిల్స్ సీఐపై వేటు

- మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ కేసులో జూబ్లీహిల్స్ సీఐ సస్పెండ్
- ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం, నిందితుడిని పట్టుకోవడంలో విఫలమవడమే కారణం
- రియల్టర్‌పై హత్యాయత్నం కేసులో సుమంత్ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు
- మంత్రి కుమార్తె వ్యాఖ్యల వివాదం కొనసాగుతుండగానే ఈ పరిణామం చోటుచేసుకుంది

- మిగతా 2లో

## 'గ్రేట్ గ్రీన్ వాల్' కార్యక్రమంలో భాగంగా తాటి వనాలను పెంచే కార్యక్రమం ప్రారంభమైంది

- తీరప్రాంతం వెంబడి 5,499 హెక్టార్లలో తాటి వానాలను ఏర్పాటు చేస్తున్నామన్న పవన్
- తుపాన్లు సంభవించినప్పుడు తీరప్రాంత గ్రామాలకు రక్షణ గోడలా పనిచేస్తాయని వెల్లడి
- కఠిన తీరప్రాంత వాతావరణాన్ని తట్టుకునే శక్తి తాటిచెట్లకు ఉందని వ్యాఖ్య


- మిగతా 2లో



## నేరం చేయకుండానే జైలు జీవితం..
## 'చంచల్‌గూడ'లో సరికొత్త అనుభవం!

- హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో 'తెలంగాణ జైల్ ఎక్స్‌పీరియన్స్'
- డబ్బులు చెల్లించి ఒక్కరోజు ఖైదీగా గడిపే వినూత్న అవకాశం
- ఖైదీల దుస్తులు, భోజనం.. క్రమశిక్షణతో కూడిన జైలు జీవితం
- ఆగస్ట్ 25 నుంచి సెప్టెంబర్ 30 వరకు అందుబాటులో జైల్ ఎక్స్‌పీరియన్స్

- మిగతా 2లో






## బీసీలపై కక్ష సాధింపు వైసీపీదే.. మాది కాదు

ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీల ఆత్మగౌరవ పరిరక్షకుడని, ఆయన నాయకత్వంలోనే బీసీలకు నిజమైన రాజకీయ, సామాజిక, ఆర్థిక సాధికారత లభించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. అవినీతి, అక్రమాలకు సంబంధించిన కేసుల్లో చట్ట ప్రకారం దర్యాప్తు సంస్థలు చర్యలు తీసుకుంటుంటే, వాటిని బీసీలపై కక్ష సాధింపుగా చిత్రీకరించే నైతిక హక్కు వైసీపీ నేతలకు లేదని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**అవినీతి కేసులను బీసీలకు ఆపాదించొద్దు**

గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలు ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని అచ్చెన్నాయుడు అన్నారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేయలేదని, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆధారాలతో చర్యలు తీసుకుందని గుర్తుచేశారు. కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి నిధులు చేరినట్లు తేలడంతో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే, దానిని బీసీలపై కక్షగా ఎలా చెబుతారని ప్రశ్నించారు. అదేవిధంగా, మద్యం కేసుల్లో దర్యాప్తు ఎదుర్కొంటున్న జోగి రమేశ్ అరెస్టును కూడా చంద్రబాబు, లోకేశ్‌కు ఆపాదించడం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదేనని విమర్శించారు.

**గత ప్రభుత్వంలో బీసీలపై దమనకాండ కాదా?**

2019-24 మధ్యకాలంలో వైసీపీ ప్రభుత్వం బలహీన వర్గాలపై సాగించిన దమనకాండను ఆ పార్టీ నేతలు గుర్తు చేసుకోవాలని అచ్చెన్నాయుడు హితవు పలికారు. "నేను బీసీని కాదా? కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడు బీసీలు కారా? వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నించినందుకే మాపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారు. ఒక్క పైసా అవినీతికి పాల్పడినట్లు ఆధారాలు చూపలేకపోయినా నన్ను 80 రోజులు జైలులో పెట్టారు. అప్పటి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాద్ ఆదేశాలతో నాపై హత్యాయత్నం కేసు పెట్టించారు. కొల్లు రవీంద్రపై హత్య కేసు, అయ్యన్నపాత్రుడిపై అత్యాచారం కేసు, యనమల రామకృష్ణుడుపై అట్రాసిటీ కేసులు పెట్టినప్పుడు బీసీలపై కక్ష గుర్తుకు రాలేదా?" అని అచ్చెన్నాయుడు నిలదీశారు.

**రిజర్వేషన్లు తగ్గించి బీసీలకు ద్రోహం చేసింది వైసీపీ**

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎన్టీఆర్ స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, చంద్రబాబు దానిని 34 శాతానికి పెంచి బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించారని అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. అయితే, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి కుదించిందని, దీనివల్ల బీసీలు సుమారు 16 వేల రాజకీయ పదవులను కోల్పోయారని ఆరోపించారు. "హైకోర్టు తీర్పు వ్యతిరేకంగా వస్తే, సుప్రీంకోర్టుకు వెళ్లకుండా బీసీలకు అన్యాయం చేసింది మీరు కాదా? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాకే వైసీపీ నేతలు బీసీల గురించి మాట్లాడాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

## కొండా సురేఖ మాజీ ఓఎస్డీ కేసు: జూబ్లీహిల్స్ సీఐపై వేటు

రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ) ఎన్. సుమంత్‌కు సంబంధించిన కేసులో జూబ్లీహిల్స్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌పై వేటు పడింది. కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం వహించారన్న ఆరోపణలతో స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్హెచ్ఓ) ముత్తు యాదవ్‌ను సస్పెండ్ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసును పోలీసులు చేపట్టిన చేసిన తీరుపై విచారణకు కూడా ఆదేశించారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారిపై దాడి కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సుమంత్ ఇప్పటికీ పరారీలో ఉన్నాడు. ఈ కేసులో ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఎఫ్ఐఆర్) నమోదు చేయడంలో జాప్యం జరిగిందని, నిందితుడిని పట్టుకోవడంలో సీఐ విఫలమయ్యారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి సుమంత్ డ్రైవర్‌ను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

**కేసు నేపథ్యం ఏమిటి?**

బోడుప్పల్‌కు చెందిన రియల్టర్ గొంగిడి హరికృష్ణ ఫిర్యాదు మేరకు సుమంత్‌తో పాటు మరో ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై ఇనుప రాడ్లు, కర్రలతో దాడి చేసి, రూ.10 కోట్లు డిమాండ్ చేశారని హరికృష్ణ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. జులై 30న రాము కార్యాలయంలో కలవాలని సుమంత్ కోరగా, అక్కడికి వెళ్లిన తనను దుర్భాషలాడుతూ ఇనుప రాడ్‌తో దాడి చేశాడని తెలిపారు. సుమంత్ ఆదేశాలతో మిగిలిన వారు కూడా దాడిలో పాలుపంచుకున్నారని వివరించారు. ఈ దాడిలో తన ఎడమ చేతికి ఫ్రాక్చర్ అయిందని, తీవ్ర రక్తస్రావంతో పాటు ఇతర గాయాలయ్యాయని, ఆగస్టు 10న శస్త్రచికిత్స చేయించుకున్నానని బాధితుడు పేర్కొన్నాడు.ఐఈ ఫిర్యాదు ఆధారంగా మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో సుమంత్, రాము, ప్రశాంత్, అరుణ్ కుమార్ రెడ్డి, కార్తీక్, మహేందర్ రెడ్డిలపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం ఈ కేసును విచారణ నిమిత్తం హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 109 కింద హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీలో దుమారం రేగిన విషయం తెలిసిందే. ఈ వివాదం నడుస్తున్న తరుణంలోనే, మంత్రి మాజీ ఓఎస్డీపై తీవ్రమైన ఆరోపణలతో కేసు నమోదు కావడం, ఇప్పుడు ఆ కేసులో పోలీసు అధికారిపై వేటు పడటం చర్చనీయాంశంగా మారింది.

## గోదావరి పుష్కరాలపై సీఎం చంద్రబాబు సమీక్ష.. ఏర్పాట్లు అద్భుతంగా ఉండాలి!

- మొదటి పేజి తరువాయి

ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.పుష్కరాల కోసం రూ.4,026 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన 4,932 పనుల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఘాట్ల నిర్మాణం, రహదారుల విస్తరణ, ఇతర మౌలిక వసతుల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, వై సత్యకుమార్ యాదవ్, గోదావరి పుష్కరాల ప్రత్యేకాధికారి, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతను కాపాడండి.. వైసీపీ డ్రామాలను నమ్మొద్దు: లోకేశ్

- మొదటి పేజి తరువాయి

కనేకల్ మండలం నల్లంపల్లిలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

**కార్యకర్తలే పార్టీకి బలం.. మీ ఫీడ్‌బ్యాక్‌కు విలువ**

"ఈ రోజు మేము మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా మీ ముందు నిలబడ్డామంటే దానికి కారణం కార్యకర్తల త్యాగాలు, శ్రమే. ముఖ్యంగా 2019-24 మధ్య కాలంలో వైసీపీ ప్రభుత్వ దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులను ఎదుర్కొని కూడా పసుపు జెండాను దించకుండా పోరాడిన మీరే పార్టీకి అసలైన బలం. అందుకే టీడీపీలో కార్యకర్తే అధినేత" అని లోకేశ్ అన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం దేశంలో ఏ పార్టీ చేయని విధంగా బీమా సౌకర్యం కల్పించి, ఇప్పటివరకు రూ.160 కోట్లు ఖర్చు చేశామన్నారు.

యువగళం పాదయాత్రలో కార్యకర్తలు కోరినట్లే, వారి అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇచ్చేందుకు 'మైటీడీపీ' యాప్‌ను తీసుకొచ్చామని తెలిపారు. "మీరు పాల్గొనే ప్రతి కార్యక్రమం, మీరు ఇచ్చే ఫీడ్‌బ్యాక్ నేరుగా మాకు చేరుతుంది. కొత్త పెన్షన్లు, ఇళ్ల మంజూరు వంటివి కార్యకర్తల ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే ప్రభుత్వ దృష్టికి తీసుకెళుతున్నాం. కష్టపడే కార్యకర్తను మేమే వెతుక్కుంటూ వస్తాం. ఎక్కడైనా సమస్య పరిష్కారం కాకపోతే, మీకు అండగా నేనుంటాను" అని హామీ ఇచ్చారు.

**అనంతపురం అభివృద్ధి నా బాధ్యత**

ఉమ్మడి అనంతపురం జిల్లా టీడీపీకి కంచుకోట అని, తమ కుటుంబాన్ని ఎల్లప్పుడూ ఆదరించిందని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "ఎన్టీఆర్‌ను, హరిమామను, మా బాల మావయ్యను గెలిపించిన గడ్డ ఇది. ఈ అభిమానాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటాను. అనంతపురం జిల్లా అభివృద్ధి నా బాధ్యత" అని స్పష్టం చేశారు. సోలార్, విండ్ ఎనర్జీ, ఫైటర్ జెట్ తయారీ సంస్థ వంటి పరిశ్రమలతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఉరవకొండలో తయారయ్యే విండ్‌మిల్‌పై 'మేడ్ ఇన్ ఉరవకొండ' అని మంత్రి కేశవ్ సంకల్పం పెట్టుకున్నారని, ఇదే స్ఫూర్తితో ఎమ్మెల్యేలంతా తమ నియోజకవర్గాల అభివృద్ధికి పోటీ పడాలని సూచించారు. ఈ సందర్భంగా, కనేకల్‌కు డిగ్రీ కళాశాల మంజూరు చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.

**గొడ్డలి పార్టీవి డ్రామాలే.. అసెంబ్లీకి రా జగన్!**

వైసీపీపై లోకేష్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "గొడ్డలి పార్టీతో మనం రాజకీయంగా పోరాడుతున్నాం. సొంత బాబాయ్‌ని హత్య చేసి, ఆ నిందను ఇతరులపై వేయడం వారి నైజం. కోడికత్తి, గులకరాయి డ్రామాలు ప్రజలు ఇంకా మర్చిపోలేదు. ఇప్పుడు లిక్కర్ స్కామ్‌లో వారి మాజీ మంత్రిని ఈడీ అరెస్ట్ చేస్తే, దానికి కూడా మమ్మల్ని నిందిస్తున్నారు" అని ఎద్దేవా చేశారు.

ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్‌కు ఆయన సవాల్ విసిరారు. "డీఎస్సీ, ఏపీపీఎస్సీకి తేడా తెలియని జగన్, డీఎస్సీపై చర్చకు సిద్ధమా? టైమ్, డేట్, లొకేషన్ నువ్వే ఫిక్స్ చెయ్. ప్రెస్‌మీట్లు కాదు, దమ్ముంటే అసెంబ్లీకి రా. పులివెందుల ప్రజలు నిన్ను గెలిపించింది వారి సమస్యలు సభలో ప్రస్తావించడానికే. కానీ రెండేళ్లలో ఒక్కసారి ప్రమాణ స్వీకారానికి వచ్చి వెళ్లిపోయావు. పులివెందుల ప్రజల కోసమైనా అసెంబ్లీకి రా" అని లోకేశ్ సవాలు చేశారు.

**కూటమి ఐక్యతను కాపాడాలి**

కూటమిలో చిచ్చు పెట్టేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని లోకేష్ హెచ్చరించారు. "జనసేన, బీజేపీ పేరుతో టీడీపీని తిడుతూ సోషల్ మీడియాలో ఫేక్ పోస్టులు పెడుతున్నారు. వాటిని నమ్మి ఆవేశపడొద్దు. మనమంతా ఐక్యంగా ఉండి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించాలి. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఒకే ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి వేగంగా సాధ్యమవుతుంది" అని దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా, సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తూ ముందుకు వెళుతున్నామని, ఇప్పటికే 16 వేల టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఇతర పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 'గ్రేట్ గ్రీన్ వాల్' కార్యక్రమంలో భాగంగా తాటి వనాలను పెంచే కార్యక్రమం ప్రారంభమైంది

రాష్ట్రంలోని సుదీర్ఘ తీరప్రాంతానికి సహజమైన రక్షణ కవచాన్ని ఏర్పరచేందుకు 'గ్రేట్ గ్రీన్ వాల్' ప్రాజెక్టులో భాగంగా తాటివనాలను పెంచే ప్రక్రియను ప్రారంభించినట్లు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. తీరప్రాంతం వెంబడి సుమారు 5,499 హెక్టార్ల పరిధిలో ఈ తాటి వనాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు.ప్రస్తుతం తాటికాయల సీజన్ నడుస్తుండటంతో, అటవీశాఖ ద్వారా తాటి గింజలను సేకరించి తీరప్రాంతాల్లో నాటే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రకృతి విపత్తులు, తుపాన్లు సంభవించినప్పుడు ఉగ్రరూపం దాల్చే ఈదురుగాలుల నుంచి తీరప్రాంత గ్రామాలకు ఈ తాటివనాలు ఒక సహజ రక్షణ గోడలా పనిచేస్తాయని పవన్ కల్యాణ్ తెలిపారు.

తీరప్రాంతాల్లో ప్రత్యేకంగా తాటిచెట్లనే ఎంచుకోవడానికి గల కారణాలను వివరిస్తూ... ఉప్పునీరు, హోరు గాలులు ఉండే కఠినమైన తీరప్రాంత వాతావరణాన్ని తట్టుకుని నిలబడే శక్తి తాటిచెట్లకు మాత్రమే ఉంటుందన్నారు. ఇసుక, బుసక, ఉప్పు నేలలతో పాటు ఒండ్రు నేలల్లో సైతం ఇవి పెరుగుతాయని పేర్కొన్నారు. తాటిచెట్లు బాగా ఎత్తుగా పెరిగే లక్షణం కలిగి ఉండటం వల్ల సముద్ర గాలులను సమర్థవంతంగా అడ్డుకుంటాయని, అంతేకాకుండా వీటి వేర్లు నేలను బలంగా పట్టి ఉంచడం ద్వారా తీరం కోతకు గురికాకుండా కాపాడుతాయని ఉపముఖ్యమంత్రి వివరించారు.

## ఏపీ లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జునరావు ప్రమాణ స్వీకారం..

ఆంధ్రప్రదేశ్ నూతన లోకాయుక్తగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జునరావు బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని లోక్‌భవన్‌లో మంగళవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై, నూతన లోకాయుక్తగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ మల్లిఖార్జునరావుకు పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు.ప్రమాణ స్వీకారం ముగిసిన అనంతరం జస్టిస్ మల్లిఖార్జునరావు, ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్ కాసేపు ముచ్చటించారు. పరిపాలనలో పారదర్శకత, అవినీతి నిర్మూలనకు లోకాయుక్త వ్యవస్థ ప్రాధాన్యాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకున్నారు. అనంతరం లోక్‌భవన్‌లో ఏర్పాటు చేసిన అల్పాహార విందులో గవర్నర్, ముఖ్యమంత్రి పాల్గొన్నారు.ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు, న్యాయశాఖకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. జస్టిస్ మల్లిఖార్జునరావు నియామకంతో రాష్ట్రంలో పరిపాలన మరింత జవాబుదారీగా మారుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

## నేరం చేయకుండానే జైలు జీవితం.. 'చంచల్‌గూడ'లో సరికొత్త అనుభవం!

జైలు జీవితాన్ని ప్రత్యక్షంగా అనుభవించాలనుకునే వారికి తెలంగాణ జైళ్ల శాఖ ఒక వినూత్న అవకాశాన్ని కల్పిస్తోంది. హైదరాబాద్‌లోని 150 ఏళ్ల చారిత్రక నేపథ్యం కలిగిన చంచల్‌గూడ జైలులో 'తెలంగాణ జైల్ ఎక్స్‌పీరియన్స్' పేరుతో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. జైలు వాతావరణం, అక్కడ అమలు చేస్తున్న సంస్కరణలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.ఈ కార్యక్రమం 2026 ఆగస్ట్ 25 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. గతంలో 2026 మే నెలలో 'ఫీల్ ది జైల్' పేరుతో ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని, ప్రజాదరణ దృష్ట్యా ఇప్పుడు మరోసారి నిర్వహిస్తున్నారు. 18 ఏళ్లు నిండిన పౌరులు ఎవరైనా ఈ ప్రక్రియలో స్వచ్ఛందంగా పాల్గొనవచ్చు.ఈ కార్యక్రమంలో పాలుపంచుకునే వారు తమ మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను నిబంధనల ప్రకారం వెలుపలే అప్పగించి, ఖైదీలకు కేటాయించే యూనిఫాం ధరించాల్సి ఉంటుంది. వీరి దినచర్య ఉదయం 6 గంటలకే ప్రారంభమవుతుంది. వ్యాయామం, యోగా, పరేడ్‌తో పాటు టైలరింగ్, వ్యవసాయం, పారిశుద్ధ్యం వంటి పనుల్లో వీరు భాగస్వాములు కావాలి. సాధారణ ఖైదీలకు వడ్డించే భోజనాన్నే వీరికి కూడా స్టీల్ ప్లేట్లు, గ్లాసుల్లోనే అందిస్తారు.

ఈ విలక్షణ అనుభవం కోసం అధికారులు వివిధ ప్యాకేజీలను రూపొందించారు. 4 గంటల సమయానికి రూ. 500, 8 గంటలకు రూ. 750, 12 గంటలకు రూ. 1,000, 24 గంటల ప్యాకేజీకి రూ. 1,500 రుసుముగా నిర్ణయించారు. రాత్రి బస చేసే వారికి ప్రత్యేక బ్యారక్‌లను కేటాయిస్తారు. ఆసక్తి ఉన్నవారు తెలంగాణ జైళ్ల శాఖ అధికారిక వెబ్‌సైట్ లేదా 'బుక్‌మైషో' ద్వారా తమ టికెట్లను బుక్ చేసుకోవచ్చు. వీటితో పాటు రూ. 10 ప్రవేశ రుసుముతో జైలు మ్యూజియంను సందర్శించే వెసులుబాటు కూడా ఉంది.

## రేవంత్ రెడ్డితో దేశ భద్రతకు ముప్పు.. ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు

అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్రంగా తప్పుబట్టారు. రేవంత్ రెడ్డి వ్యవహారశైలి రాష్ట్ర శాంతిభద్రతలకే కాకుండా దేశ భద్రతకు కూడా ముప్పుగా మారుతోందని ఆరోపించారు.విదేశీ పర్యటనల్లో రేవంత్ రెడ్డి దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలుపుతున్నారని అర్వింద్ విమర్శించారు. విదేశాల్లో దేశంపై విషం చిమ్మే వారితో మాట్లాడటం ద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ కంటే రేవంత్ రెడ్డి ప్రమాదకరమైన వ్యక్తి అని తాను గతంలోనే చెప్పానని, ఇకపై ఆయన ప్రతి కదలిక జాతీయ భద్రతా సంస్థల పరిశీలనలో ఉంటుందని వ్యాఖ్యానించారు.మరోవైపు రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై కూడా అర్వింద్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బకాయిలు చెల్లించకపోవడంతో విద్యాసంస్థలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. బకాయిలను క్లియర్ చేస్తామని రాహుల్ గాంధీతో హామీ ఇప్పించినా ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు.రాష్ట్రంలోని విద్యాసంస్థలను పట్టించుకోకుండా విదేశాల నుంచి కొత్త విద్యాసంస్థలను తీసుకొస్తామని చెప్పడం ఏంటని అర్వింద్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకాదని తెలంగాణ ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని అన్నారు.

## రాయలసీమకు సుజ్లాన్ భరోసా.. రూ.10 వేల కోట్ల ప్రాజెక్టుకు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన

- మొదటి పేజి తరువాయి

హలకుంది గ్రామంలో ఉన్న సుజ్లాన్ బ్లేడ్ స్టాక్ యార్డును మంత్రి సందర్శించి, అక్కడి విండ్ టర్బైన్‌పై తన సంతకం చేశారు.

ఈ సందర్భంగా సుజ్లాన్ ప్రతినిధులు ప్రాజెక్టు విశేషాలను మంత్రికి వివరించారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో 1,700 మెగావాట్లకు పైగా స్థాపిత సామర్థ్యంతో అతిపెద్ద విండ్ భాగస్వామిగా ఉన్న సుజ్లాన్, తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. 2030 నాటికి రాష్ట్రంలో అదనంగా మరో 5,000 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను స్థాపించడమే లక్ష్యంగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. పవన విద్యుత్ ఉత్పత్తిలో ఏపీని కీలక కేంద్రంగా మార్చేందుకు ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కీలక కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా జి. లక్ష్మీనారాయణ, స్థానిక ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు (రాయదుర్గం), అమిలినేని సురేంద్రబాబు (కల్యాణదుర్గం), దగ్గుపాటి వెంకట ప్రసాద్ (అనంతపురం అర్బన్) పాల్గొన్నారు. సుజ్లాన్ గ్రూప్ తరపున కో-ఫౌండర్, వైస్ ఛైర్మన్ గిరీష్ తంతి, సీఈవో అజయ్ కపూర్, అడ్వైజర్ వి.బి. రావు, ఇతర భాగస్వామ్య సంస్థలైన టాటా పవర్ ఎండీ సంజయ్ బంగా, టోరెంట్ పవర్ డైరెక్టర్ జిగీష్ మెహతా, వారీ ఎనర్జీస్ సీఎండీ హితేష్ దోషి, ఎన్ఆర్ఈడీసీఏపీ లిమిటెడ్ వీసీ, ఎండీ ఎమ్. కమలాకర బాబు, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తదితర ప్రముఖులు హాజరయ్యారు.

## ఆరోగ్యం క్షీణించడంతో దీక్ష విరమించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షను రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు రెండో రోజే విరమించారు. దీక్షలో ఉండగా ఆయన ఆరోగ్యం క్షీణించడంతో, పార్టీ సీనియర్ నేతల సూచన మేరకు మంగళవారం దీక్షను ముగించారు.సోమవారం ప్రారంభమైన ఈ దీక్షలో రాంచందర్ రావు ఆరోగ్యం మంగళవారం క్షీణించింది. ఆయన రక్తపోటు (బీపీ) గణనీయంగా పడిపోవడంతో పార్టీ శ్రేణులు ఆందోళనకు గురయ్యాయి. దీంతో, సీనియర్ నేతలు దీక్షను విరమించాలని ఆయనకు సూచించారు. అనంతరం, పార్టీ సీనియర్ నేత, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్.. రాంచందర్ రావుకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.అంతకుముందు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర నేతలు దీక్షా శిబిరానికి వచ్చి రాంచందర్ రావుకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచించాలని హితవు పలికారు.

**కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**

దీక్ష విరమించడానికి ముందు రాంచందర్ రావు 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "తెలంగాణ విద్యార్థుల గొంతుక.. 58 ఏళ్ల యువ నేతగా చెప్పుకునే వ్యక్తికి కానీ, హైదరాబాద్‌లోని ఆయన గులాంకు కానీ వినిపించడం లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం కావడంతో 40 లక్షల మంది విద్యార్థులు ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు దూరమవుతున్నారు" అని ఆయన ఆరోపించారు.దాదాపు రూ.15,000 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "యువతకు తామే సంరక్షకులమని చెప్పుకోవడం కాంగ్రెస్ పార్టీకి ఉన్న ఓ బూటకం. తెలంగాణ యువత మేల్కొంది, ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉంది" అని రాంచందర్ రావు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్ర విద్యావ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, రేపు ఇదే యువత ప్రభుత్వాన్ని గద్దె దించుతుందని ఆయన అన్నారు.

## స్థానిక ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే వైసీపీదే విజయం

- మొదటి పేజి తరువాయి

నిలబడాల్సిన కీలక సమయమని జగన్ పేర్కొన్నారు. గతంలో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు చూశామన్న ఆయన.. ఈసారి ప్రతి స్థానంలోనూ సమర్థులైన, బలమైన అభ్యర్థులను పోటీకి దింపాలని సూచించారు. అవసరమైతే నాయకులు తమ కుటుంబ సభ్యులను సైతం బరిలోకి దించేందుకు వెనకాడకూడదని పిలుపునిచ్చారు. ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని... ఒకవేళ ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే అక్కడి కో-ఆర్డినేటర్లు భవిష్యత్తులో అసెంబ్లీ అభ్యర్థులుగా కొనసాగలేరని హెచ్చరించారు.పార్టీ కేడర్ బలోపేతం కోసం 14 నుంచి 15 లక్షల క్యూఆర్ కోడ్ ఆధారిత గుర్తింపు కార్డులు సిద్ధమయ్యాయని... సెప్టెంబరు 5 నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించి వీటిని పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. 'వెన్నుపోటు పార్టీ -- వెన్నుపోటు పాలన' అనే నినాదంతో గ్రామ స్థాయిలో వైసీపీ - కూటమి పాలన మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.కార్యకర్తలను రక్షించుకోవడానికి నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు లీగల్, మీడియా సెల్స్‌ను బలోపేతం చేయాలని... అవసరమైతే కేసులు హైకోర్టు వరకు తీసుకెళ్లేలా సమన్వయ వ్యవస్థ ఉండాలని తెలిపారు. అలాగే సోషల్ మీడియాను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని, 'జగన్ 2.0 సూపర్ యాప్', యూట్యూబ్, ఎక్స్ వంటి వేదికల ద్వారా నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరుతూ, రాజకీయ ఒత్తిళ్లతో చట్టవిరుద్ధంగా వ్యవహరించే అధికారుల పేర్లను డిజిటల్ బుక్‌లో నమోదు చేసి, భవిష్యత్తులో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాయకులు తమ ఈగోలను పక్కనపెట్టి, రాబోయే 60-70 రోజులు నియోజకవర్గాల్లోనే ఉంటూ స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# మంజూరైనా.. మొదలుకాని బోనంగిపల్లి రహదారి

- వర్షం పడితే అడుగేయలేని దుస్థితి..
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టి సారించాలని వినతి



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, ఆగస్టు 25:** ప్రభుత్వం రహదారి మంజూరు చేసినా పనులు ప్రారంభం కాకపోవడంతో గూడెంకొత్తవీధి మండల కేంద్రానికి సమీపంలోని బోనంగిపల్లి గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. "దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదు" అన్న చందంగా తమ పరిస్థితి మారిందని స్థానిక గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో వర్షం పడితే బురదమయమై కనీసం నడిచి వెళ్లేందుకు కూడా వీలు లేకుండా పోతోందని తెలిపారు. ప్రభుత్వం రహదారిని మంజూరు చేసిన నేపథ్యంలో ఇప్పటికైనా పనులు ప్రారంభించి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారించి, మంజూరైన రహదారి నిర్మాణం త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# రీ-సర్వేను వేగవంతం చేయాలి

## పెండింగ్ రెవెన్యూ సమస్యలను గడువులోగా పరిష్కరించాలి: కలెక్టర్ నిశాంతి



**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు, పెన్ పవర్, ఆగస్టు 25:** జిల్లాలో భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ టి. నిశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి రాష్ట్రస్థాయి రెవెన్యూ అధికారులు నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఆమె పాల్గొని జిల్లాలో రెవెన్యూ అంశాలపై సమీక్షించారు.ప్రజలకు రెవెన్యూ సేవలను పారదర్శకంగా, జవాబుదారీతనంతో, నిర్ణీత సమయంలో అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని 1,400 గ్రామాల్లో మూడు విడతలుగా రీ-సర్వే ప్రక్రియ చేపడుతున్నామని, ఇప్పటికే మొదటి విడత సర్వే పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. రీ-సర్వేను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ రికార్డులను సక్రమంగా నిర్వహించడంతో పాటు వాటి భద్రతకు డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.పట్టాదారు పాసుపుస్తకాల్లో నమోదైన తప్పులను సరిదిద్ది రైతులకు సకాలంలో పాసుపుస్తకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. మ్యుటేషన్లు, ఆర్ఓఆర్ ప్రక్రియలను ఎలాంటి జాప్యం లేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు అందుతున్న రెవెన్యూ సేవలపై ఐవీఆర్ఎస్ ద్వారా సేకరిస్తున్న అభిప్రాయాలను నిరంతరం సమీక్షించి, అవసరమైన చోట సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు.రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు, మండల రెవెన్యూ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం ముగింపు



- అంగన్వాడి కార్యకర్తలు ప్రాథమిక విద్యా చిన్నారులకు అందించాలి.
- ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి యు విమల కుమారి.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 26.** మండల పరిధిలో గల అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యా బోధనను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో నిర్వహించిన జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం చివరి రోజు శిక్షణ విజయవంతంగా ముగిసిందని సిడిపిఓ విమల కుమారి అన్నారు. ముంచింగిపుట్టు మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల1 లో ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ యు. విమల కుమారి ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి నట్లు సిడిపిఓ తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా 3 నుంచి 6 సంవత్సరాల చిన్నారులకు ఆటపాటలు కథలు కార్యకలాపాలు బోధనాఅ భ్యసన సామగ్రి టిఎల్ఎం ద్వారా ఆసక్తికరంగా విద్యను అందించే విధానాలపై అంగన్వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. చిన్నారుల పోషణ ఆరోగ్యం తల్లిదండ్రుల భాగస్వామ్యం డిజిటల్ సాధనాల వినియోగం అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను సమర్థవంతంగా అమలు చేసే విధానాలపై శిక్షణ అందించారు. చివరి రోజు శిక్షణలో ఇప్పటివరకు నేర్చుకున్న అంశాలను పునశ్చరణ చేయడంతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లో వాటిని ఆచరణలో పెట్టే విధానాలపై డీఆర్పీలు ఉపాధ్యాయులు అంగన్వాడీ టీచర్లకు మార్గదర్శనం చేశారు. శిక్షణలో పాల్గొన్న అంగన్వాడీ కార్యకర్తలు వివిధ ప్రదర్శనలు, కార్యకలాపాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.లింగన్న, కె. లోకేష్, పి. పుండరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్. రాజేశ్వరి, సి.హెచ్. వరహాలమ్మ, ఎస్. కొండమ్మ, సి.హెచ్. స్వర్ణ, ప్రాజెక్టు బ్లాక్ కోఆర్డినేటర్ వి. సురేష్ పాల్గొన్నారు.

# జూడాల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలం

- స్టైపెండ్ పెంపుపై త్వరలో ఉన్నతస్థాయి కమిటీతో చర్చలు
- రిటైర్మెంట్ వయసు పెంపుపై పునఃపరిశీలన: మంత్రి సత్యకుమార్
- నాన్ క్లినికల్ పోస్టుల్లో ఎంఎస్సీ, పీహెచ్‌డీ అభ్యర్థుల అంశంపైనా సమీక్ష

**విశాఖ దక్షిణం పెన్ పవర్ ఆగస్టు 25 :** జూనియర్ డాక్టర్ల (జూడా) డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా, సానుభూతితో వ్యవహరిస్తుందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులను పరిగణనలోకి తీసుకుని ఇతర రాష్ట్రాల్లో జూడాలకు అందుతున్న స్టైపెండ్, ఇతర ప్రయోజనాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణల్లో జూనియర్ డాక్టర్లకు అందుతు న్న స్టైపెండ్, ఇతర సదుపాయాలను రాష్ట్రంలో అమలవు తున్న విధానంతో ఇప్పటికే పోల్చి పరిశీలించినట్లు మంత్రి వెల్లడించారు.మంగళవారం రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో జూడా ప్రతినిధులు మంత్రి సత్యకుమార్, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి జి.వీర పాండియన్‌ను కలిశారు. సమ్మెను విరమించి విధుల్లోకి తిరిగి చేరుతున్నట్లు ప్రతిని ధులు మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

**స్టైపెండ్ పెంపుపై కమిటీ పరిశీలన**

జూడాల స్టైపెండ్ పెంపు అంశంపై ప్రత్యేక కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఆరోగ్యశాఖ కార్యదర్శి వీర పాండియన్ ఆధ్వర్యంలో ఈ కమిటీ పనిచేస్తుందని చెప్పారు. ఒకటి, రెండు రోజుల్లో జూడా సంఘాల ప్రతినిధు లతో కమిటీ సమావేశమై వారి డిమాండ్లపై చర్చించనున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వ ఆర్థిక పరిమితులు, అందుబాటులో ఉన్న వనరులు, ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానా లను పరిగణనలోకి తీసుకుని అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మంత్రి చెప్పారు.

**రిటైర్మెంట్ వయసుపై పునఃపరిశీలన**

రిటైర్మెంట్ వయసు పెంపు అంశంపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని సత్యకుమార్ స్పష్టం చేశారు. కొన్ని ప్రాంతాల్లో వైద్యుల కొరత ఉన్న నేపథ్యంలో ఈ అంశాన్ని పరిశీలించినట్లు తెలిపారు. అయితే జూడాల అభ్యంతరాలను దృష్టిలో ఉంచుకుని రిటైర్మెంట్ వయసు పెంపుపై మరోసారి పునఃపరిశీలన చేస్తామని వెల్లడించారు.

**నాన్ క్లినికల్ పోస్టులపైనా సమీక్ష**

నాన్ క్లినికల్ విభాగాల్లో ఎంఎస్సీ, పీహెచ్‌డీ అర్హత కలిగిన అభ్యర్థులను నియమించే అంశంపైనా పునఃపరిశీలన చేస్తామని మంత్రి తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం ఇప్పటివరకు తుది నిర్ణయం తీసుకోలేదన్నారు.జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా కొత్త వైద్య కళాశాలలను త్వరగా ప్రారంభించాల్సిన అవసరం ఏర్పడటంతో నోటిఫికేషన్లు జారీ చేసినట్లు చెప్పారు. వాటికి తగిన స్పందన రాకపోవడంతో కొన్ని చర్యలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. జూడాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని ఈ అంశంపైనా మరోసారి సమీక్షిస్తామని స్పష్టం చేశారు.

**సీఎం దృష్టికి జూడాల సమస్యలు**

జూడాల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రభు త్వం వారి డిమాండ్ల పట్ల సానుకూలంగా ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ పరిమితులపై జూడా ప్రతినిధులకు కూడా అవగాహన ఉందని చెప్పారు. ఇరువర్గాల మధ్య చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం కనుగొనే ప్రయత్నం జరుగుతుందని వెల్లడించారు.



**9,500 మంది జూడాల సేవలు కీలకం**

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో దాదాపు 9,500 మంది జూనియర్ డాక్టర్లు సేవలందిస్తున్నారని మంత్రి తెలిపారు. పేద, సామాన్య ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై ఆధారప డుతున్న నేపథ్యంలో ముఖ్యంగా అత్యవసర వైద్య సేవల్లో జూడాల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు.

సమ్మె కారణంగా అత్యవసర వైద్య సేవలకు ఇబ్బందులు తలెత్తే పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జూడాలు మానవతా దృక్పథంతో సమ్మె విరమించడం అభినందనీయమన్నారు. ప్రజల ఆరోగ్య ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని విధుల్లోకి తిరిగి వచ్చిన జూడా నాయకులు, వైద్యులందరికీ మంత్రి మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. వారి సమస్యల పరిష్కా రంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# నట్టేట ముంచిన గుత్తేదారుని నిర్లక్ష్యం. వర్షాలకుకొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన.

- గాలిలో కలిసిన అధికారుల హామీలు.. గాలికొదిలేసిన శాశ్వత పనులు.
- దిగ్బంధనంలో నాలుగు గిరిజన గ్రామాలు.
- ప్రాణసంకటంగా మారిన రాకపోకలు.

**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 25 :**మన్యంలో కురుస్తున్న భారీ వర్షాలు గిరిజనుల పాలిట శాపంగా మారుతున్నాయి. అధికారుల పర్యవేక్షణా లోపం, గుత్తేదారుడి నిర్లక్ష్యం వెరసి గిరిజనుల బతుకులను నట్టేట ముంచాయి. కోరుకొండ-బూరుగుబయలు గ్రామాల మధ్య బంద్రేవు కాలువపై శాశ్వత వంతెన నిర్మాణాన్ని గాలికొదిలేయడంతో, తాజాగా కురిసిన వర్షాలకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన తూముల వంతెన వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో బూరుగుబయలు, తూరుమామిడి, వీరవరం, బురదమామిడి తదితర గ్రామాల ప్రజలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి దిగ్బంధనంలో చిక్కుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఏకధాటిగా కురిసిన వర్షానికి బంద్రేవు కాలువ పొంగి, తాత్కాలిక కల్వర్టును పూర్తిగా ఊడ్చుకుపోయింది.

మండలంలోని బలపం పంచాయతీ పరిధిలో ఉన్న ఈ కాలువ వద్ద ఏళ్ల తరబడి రాకపోకల సమస్య ఉంది. ఎట్టకేలకు శాశ్వత వంతెన నిర్మాణానికి మోక్షం లభించినా గుత్తేదారుల నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. వాతావరణం అనుకూలించే ఎండాకాలంలో పనులను వేగవంతం చేయకుండా కాంట్రాక్టర్ తీవ్ర నిర్లక్ష్యం వహించాడు. కొద్దిరోజులు తూతూమంత్రంగా పనులు చేసి అర్ధాంతరంగా వదిలేశాడు. అధికారుల పర్యవేక్షణ సైతం కొరవడటంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఏటా వర్షాకాలంలో కాలువ ఉప్పొంగడం, తాత్కాలిక మార్గాలు కొట్టుకుపోవడం ఇక్కడ పరిపాటిగా మారింది. తెలిసీ శాశ్వత పరిష్కారం చూపడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైందని, అధికారుల నిర్లక్ష్యానికి తాము మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బంద్రేవు కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కోరుకొండ ప్రాంతానికి వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గం లేక గిరిజనులు అల్లాడిపోతున్నారు.



ఎవరికైనా అనారోగ్యం చేసినా, గర్భిణులకైనా అత్యవసర వైద్యం అందే పరిస్థితి లేకుండా పోయింది. 108 అంబులెన్స్ వచ్చే దారి మూసుకుపోవడంతో ఏదైనా జరగరానిది జరిగితే ప్రాణాలు గాలిలో కలవాల్సిందేనని స్థానికులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మరోవైపు విద్యార్థులు పాఠశాలలకు వెళ్లలేక ఇళ్లకే పరిమితమయ్యారు. నిత్యావసరాలు తెచ్చుకునేందుకు సైతం తీవ్ర అవస్థలు పడుతున్నారు. రానున్న రోజుల్లో వర్షాలు మరింత పెరిగితే పరిస్థితి చేజారిపోతుందని, అధికారులు మొద్దునిద్ర వీడి తక్షణమే స్పందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రాకపోకలకు సురక్షితమైన ప్రత్యామ్నాయ మార్గాన్ని యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయడంతో పాటు, నిలిచిపోయిన శాశ్వత వంతెన నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని పరిసర గ్రామాల గిరిజనులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## చిన్నగడ్డ వద్ద జాతీయ రహదారి రిటైనింగ్ జారిపడింది.

* భయభ్రాంతులకు గురైన వాహనదారులు.




**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 25.** అల్లూరి జిల్లా, చింతపల్లి మండలం, చిన్న గడ్డ జాతీయ రహదారి వద్ద నిర్మించిన రిటైనింగ్ వాల్ జారిపడింది. గత రెండు రోజులగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జాతీయ రహదారి పక్కన నిర్మించిన రిటైనింగ్ వాల్ కుప్పకూలింది. రోడ్డు పక్కన భారీగా మట్టి కొట్టుకుపోయి సిమెంట్ గోడ పూర్తిగా కూలి పక్కనే ఉన్న వరి పొలాల్లో పడింది. పొలాల్లో రైతులెవరు లేకపోవడంతో అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.వర్షాల కారణంగా మట్టి పట్టు సడలి ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. రోడ్డు పక్కన పెద్ద గొయ్యి ఏర్పడటంతో వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని చిన్నగడ్డ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## అల్లూరి జిల్లాలో వైయస్సార్ పార్టీకి తగ్గని హోరు.

* చిరస్థాయిగా గిరిజనులు గుండెల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పదిలం.
* విద్య, వైద్యం కోసం జగనన్న చేసిన కృషి మన్యం ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు.
* చింతపల్లి మాజీ సర్పంచ్, వైయస్సార్ సిపి నాయకురాలు దురియా పుష్పలత.



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 25.** అల్లూరి మన్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జోరు ఏమాత్రం తగ్గలేదు అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత చింతపల్లి మాజీ సర్పంచ్ దురియ పుష్పలత పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీలు మారినా నాయకులు ఉండొచ్చేమో కానీ అట్టడుగు గిరిజన ప్రజలు మాత్రం ఇప్పటికీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైపే ఉన్నారని ఆమె తెలియజేశారు.

జగనన్న హయాంలో విద్య, వైద్య రంగాల్లో చేసిన విప్లవాత్మక మార్పులు మన్యం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని ఆమె గుర్తు చేస్తున్నారు.

విద్యా రంగంలో

నాడు-నేడు ద్వారా ఏజెన్సీలో శిథిలావస్థలో ఉన్న గిరిజన పాఠశాలలకు కార్పొరేట్ హంగులు అద్ది అద్భుతమైన ఫర్నిచర్ కల్పించారని ఆమె పేర్కొన్నారు. అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, గోరుముద్ద పథకాలతో పేద గిరిజన బిడ్డల చదువుకు ఆర్థిక భరోసా కల్పించారన్నారు.ఇంగ్లీష్ మీడియం, బైజూస్ కంటెంట్ తో గిరిజన విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించిన చరిత్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి దే అని గత ప్రభుత్వ పాలనను ఆమె కొనియాడారు.

వైద్య రంగంలో

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితిని 25 లక్షలకు పెంచి గిరిజనులకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించారు. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ లు, ఫ్యామిలీ డాక్టర్ విధానంతో మారుమూల మన్యం గ్రామాల్లోకి వైద్య సేవలను తీసుకెళ్లారన్నారు.ఆరోగ్య ఆసరా ద్వారా ఆపరేషన్ తర్వాత కూడా రోగికి ఆర్థిక సాయం అందించారు అని ఆమె జ్ఞాపకం చేశారు.

ఈ సంక్షేమ పాలనే నేటికీ ప్రజల గుండెల్లో జగనన్నను చెరగని ముద్రగా నిలిపిందని, ఇటీవల వస్తున్న తప్పుడు వార్తా కథనాలను మన్యం ప్రజల నమ్మరని ఆమె అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రజలు సిద్ధంగా ఉండి జగన్ అన్న ప్రజా పాలనను ఆదరించాలని ఆమె అల్లూరి మన్యం ప్రజలను ఉద్దేశించి పిలుపునిచ్చారు.

## పారిశ్రామిక ప్రాంతం సమగ్ర అభివృద్ధికి తోడ్పాటు అందించాలి : ఎం ఎల్ ఏ పల్లా



**గాజువాక :పెన్ పవర్ ,ఆగస్టు 25** కూటమి ప్రభుత్వ రెండేళ్లలో 250 కోట్ల రూపాయలతో నియోజవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టామని , 300 కోట్ల రూపాయలతో గాజువాక సమగ్ర అభివృద్ధికి ప్రతిపాదన అందించాలని పల్లా ఆదేశించారు గాజువాక జోనల్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన జీవీఎంసీ వివిధ శాఖల అధికారులతో గాజువాక శాసనసభ్యుడు , రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. గాజువాక నియోజకవర్గం అభివృద్ధి చెందే దిశగా అధికారులు పనిచేయాలని అన్నారు. నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న పలు సమస్యలపై అధికారులతో చర్చించి ఆరా తీశారు. గాజువాక నియోజకవర్గంని సుందరీకరణంగా మార్చడమే తన ప్రథమ లక్ష్యాన్ని పల్లా శ్రీనివాసరావు అన్నారు. జగ్గు జంక్షన్ నుండి గంగవరం పోర్ట్ వెళ్లే మార్గం కాలుష్య రహితంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు . పెదగంట్యాడ ప్రధాన రహదారి 150 అడుగుల తగ్గకుండా చూడాలని ఆదేశించారు. పాత గాజువాక నుండి శ్రీనగర్ వరకు సర్వీస్ రోడ్ నిర్మాణానికి అతి త్వరలోనే శంకుస్థాపన జరుగుతుందన్నారు . నియోజకవర్గంలో ఉన్న స్మశానవాటికలను ఆధునీకరణంగా చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న పిల్లలు యువత ఆటల్లో ముందుకు కొనసాగేలా ప్రతి ఒక్క వార్డులోని బాక్స్ క్రికెట్ లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. నియోజవర్గంలో ఆరు అధునాతనమైన స్టేడియం నిర్మాణాలు జరుగుతుందని అన్నారు . ప్రభుత్వం సంక్షమం ,అభివృద్ధి కార్యక్రమాలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు . ప్రజలకు సేవలు అందించడానికే ప్రభుత్వ అధికారులు ,నాయకులు ఉన్నారని పల్లా అన్నారు . కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శేషాద్రి నాయుడు, ఈ ఈ రాయల్ బాబు, డీసీపీ మధుసూదన్, వాటర్ వర్క్స్ డి ఈ శ్రీనివాసరావు,ఆర్ ఓ రామనారాయణ పలు శాఖల అధికారులు , నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# వర్షం పడితే ఎల్.పెదపాడు రహదారి అధ్వానం





**రహదారి లేక గిరిజనుల అవస్థలు.. పట్టించుకోని అధికారులు**

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, ఆగస్టు 25:** గూడెంకొత్తవీధి మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో రహదారుల దుస్థితి నానాటికీ అధ్వానంగా మారుతోంది. సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని ఎల్.పెదపాడు గ్రామానికి వెళ్లే రహదారి ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.గ్రామానికి ఇప్పటికీ పక్కా రహదారి లేకపోవడంతో కొద్దిపాటి వర్షం కురిసినా మార్గం మొత్తం బురదమయంగా మారుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై భారీగా బురద పేరుకుపోవడంతో కనీసం నడిచి వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామస్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఆసుపత్రికి తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. నిత్యావసర సరుకుల కోసం గ్రామం నుంచి బయటకు వెళ్లాలన్నా బురద రహదారిపైనే ప్రయాణించాల్సి వస్తోందని తెలిపారు. వర్షాకాలంలో సమస్య మరింత తీవ్రంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఏళ్లుగా రహదారి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా పరిష్కారం లభించలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఎల్.పెదపాడు గ్రామానికి పక్కా రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. వర్షాకాలంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణ ఉపశమన చర్యలు చేపట్టి, శాశ్వత రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

# చెరువుకు జాతీయ రహదారి దెబ్బ!



**జాతీయ రహదారి నిర్మాణంతో మట్టి చేరిక..**

**పూడిక తొలగింపుపై అధికారుల పరిశీలన**

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, ఆగస్టు 25:** జాతీయ రహదారి నిర్మాణం కారణంగా మట్టి చేరి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిన పెదవలస పెద్ద చెరువును ఇరిగేషన్ శాఖ జూనియర్ ఇంజనీర్ నాగరాణి మంగళవారం పరిశీలించారు. చెరువులో పేరుకుపోయిన పూడికను తొలగించడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆమె పరిశీలన చేశారు.పెదవలస గ్రామంలో ఈ నెల 3న నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో గ్రామస్థులు చెరువు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జాతీయ రహదారి నిర్మాణ సమయంలో భారీగా మట్టి చెరువులోకి చేరడంతో లోతు తగ్గిపోయిందని, ఫలితంగా నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పడిపోయిందని తెలిపారు. పూడిక తొలగించడంతో పాటు నీటిని నిల్వ చేసుకునేందుకు అవసరమైన చోట అనకట్టు లేదా డయాఫ్రం వాల్ నిర్మించాలని కోరుతూ ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు.గ్రామస్థుల వినతిపై స్పందించిన ఇరిగేషన్ అధికారులు చెరువు పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈ నాగరాణి చెరువు విస్తీర్ణం, పూడిక పేరుకుపోయిన ప్రాంతాలు, ప్రస్తుత పరిస్థితిని పరిశీలించారు. రెవెన్యూ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని చెరువు విస్తీర్ణాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం అవసరమైన మరమ్మతులు, అభివృద్ధి పనులపై నివేదిక సిద్ధం చేస్తామని గ్రామస్థులకు తెలిపారు.జాతీయ రహదారి నిర్మాణంతో చెరువులోకి చేరిన మట్టితో పాటు పేరుకుపోయిన పూడికను తొలగించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని నాగరాణి తెలిపారు.పూడిక తొలగించి చెరువు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు అవసరమైన చోట అనకట్టు లేదా డయాఫ్రం వాల్ నిర్మించాలని గ్రామస్థులు కోరారు. చెరువు పునరుద్ధరణ జరిగితే వర్షాకాలంలో నీటిని సమృద్ధిగా నిల్వ చేసుకోవడంతో పాటు ఏడాది పొడవునా వ్యవసాయానికి నీటి సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. పెదవలస గ్రామానికి వ్యవసాయపరంగా కీలకమైన పెద్ద చెరువును పునరుద్ధరించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కంకిపాటి మోహన్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలపై జనసేన సమన్వయ కమిటీలకు బాధ్యతలు

27న పాడేరులో సమన్వయ కమిటీ సమావేశం




**స్టాఫ్ రిపోర్టర్, పాడేరు, పెన్ పవర్, ఆగస్టు 25:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా పాడేరు నియోజకవర్గంలోని ప్రతి మండలానికి ఏడుగురు సభ్యులతో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసినట్లు పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ వంపూరు గంగులయ్య తెలిపారు. ఆయా కమిటీ సభ్యులు తమ పరిధిలోని పంచాయతీల వారీగా సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవులకు పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్న ఆశావహుల వివరాలను సేకరించాలని సూచించారు. రెండు మూడు రోజుల్లోగా పూర్తి సమాచారాన్ని అందజేయాలని, పార్టీ బలోపేతానికి కృషి చేసే వారికి అభ్యర్థుల జాబితాలో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సేకరించిన వివరాలపై కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా చర్చించి, అనంతరం పార్టీ అధిష్ఠానానికి నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. సమన్వయ కమిటీ సభ్యులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.మండలాల వారీగా నియమించిన సమన్వయ కమిటీ సభ్యులతో ఈ నెల 27న పాడేరులోని జనసేన పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు గంగులయ్య తెలిపారు. అప్పటికి సేకరించిన వివరాలతో సభ్యులు సమావేశానికి హాజరు కావాలని సూచించారు. మిగిలిన అంశాలపై సమావేశంలో దిశానిర్దేశం చేస్తామని పేర్కొన్నారు.

# రైతులంతా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

**పీఎం కిసాన్ తదుపరి విడతకు రైతు ఐడీ తప్పనిసరి**



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, ఆగస్టు 25:** మండలంలోని రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సురేష్ సూచించారు. మంగళవారం ఆసరాడ గ్రామపంచాయతీలో నిర్వహించిన ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 15,905 మంది రైతులు ఉండగా ఇప్పటివరకు 9,132 మంది మాత్రమే నమోదు చేసుకున్నారని తెలిపారు. గతంలో అటవీ హక్కుల పట్టాలు (ఆర్ఓఎఫ్ఆర్) పొందిన రైతుల్లో పలువురు ఇప్పటివరకు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోలేదని, వారంతా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలో 9,233 మంది రైతులకు పీఎం కిసాన్ పథకం ప్రయోజనం అందుతుండగా, ఇప్పటివరకు 5,708 మంది మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకున్నారని తెలిపారు. ఫార్మర్ ఐడీ కలిగిన రైతులు మాత్రమే పంటల బీమా, సబ్సిడీ విత్తనాలు, వివిధ సంక్షేమ పథకాలు, ఇన్పుట్ సబ్సిడీ వంటి ప్రభుత్వ ప్రయోజనాలకు అర్హులవుతారని వ్యవసాయ అధికారి తెలిపారు. పీఎం కిసాన్ పథకం తదుపరి విడత ప్రయోజనం కూడా ఫార్మర్ ఐడీ ఉన్న రైతులకే అందుతుందని పేర్కొన్నారు.అందువల్ల రైతులంతా సమీపంలోని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే పీఎం కిసాన్ పథకానికి సంబంధించిన వార్షిక ఈ-కేవైసీని రైతు సేవా కేంద్రాలు లేదా మీ-సేవ కేంద్రాల్లో ఈ నెల 31వ తేదీలోపు పూర్తి చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు సౌందర్య, గ్రామ ఉద్యాన సహాయకుడు సింహాచలంతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఒకేషనల్ ఎడ్యుకేషన్, ఎలక్ట్రానిక్స్ విద్యార్థులకు ఇండస్ట్రియల్ సందర్శన...!

ప్రధానోపాధ్యాయులు "సిహెచ్ శ్రీనివాసరావు"




**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 25:** కొయ్యూరు గిరిజన సంక్షేమ శాఖ బాలుర(1) ఆశ్రమ పాఠశాలలో 9, 10, తరగతుల్లో చదువుతున్న విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషన్ లో భాగంగా ఎలక్ట్రానిక్ విద్యార్థులకు ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఎలక్ట్రానిక్స్ చదువుతున్న విద్యార్థులు ను పోలవరం జిల్లా రాజవొమ్మంగి 33/11 కె.వి సబ్ స్టేషన్ కి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. విద్యార్థులు అందరూ ట్రాన్స్ఫర్లు, సర్క్యూట్ బ్రేకర్లు, కంట్రోల్ ప్యానెల్స్ ఇతర పరికరాలను పరిశీలించడం జరిగిందన్నారు. అలాగే విద్యుత్ సరఫరా, విద్యుత్ పంపిణీ విధానం భద్రతా చర్యలపై అసిస్టెంట్ ఇంజనీర్ కొంగర అబ్బాయి దొర, జూనియర్ ఇంజనీర్ విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ ఒకేషనల్ విజిట్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా నిలిచిందని ఒకేషనల్ ఉపాధ్యాయులు బొడ్డు సిసింద్రీ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# బాల్య వివాహాలు, బాలల భద్రత పై అవగాహన...!



* ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలతో సమన్వయ సమావేశం
* కొయ్యూరు సీఐ "బి శ్రీనివాసరావు"

**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 25:** బాల్యవివాహాలు నివారణ, బాలల భద్రత పై, ప్రభుత్వ ఉపాధ్యాయులు, అంగన్వాడి కార్యకర్తలతో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగిందని కొయ్యూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండలంలో కొయ్యూరు సిఎ హెచ్ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపిల్లలు బాలికలు మహిళలు భద్రతను మరింత బలోపేతం చేయడం సమస్యలను ముందుగా గుర్తించి సంబంధిత అధికారులకు సమాచారం అందించడం పోలీస్ శాఖతో సమన్వయం తో పనిచేయడంపై అవగాహన కల్పించారు. బాలల భద్రత పి ఓ సి ఎస్ ఓ చట్టం బాల్యవివాహాలు నివారణ, మహిళల భద్రత మాదకద్రవ్యాల దుష్పరిమాణాలు, సైబర్ నేరాల, వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ప్రత్యేకంగా బాల్య వివాహాల వల్ల కలిగే సామాజిక ఆరోగ్య విద్యాపరమైన నష్టాలను వివరించడం జరిగింది. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే విషయాన్ని సంబంధిత పోలీసు అధికారులకు ఇతర దృష్టికి తీసుకురావాలని సూచించారు కొనసాగించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు అలాగే పిల్లలపై ఎలాంటి శారీరక మానసిక లైంగిక వేధింపులు జరిగిన నిర్లక్ష్యం చేయకుండా పిల్లల తమ సమస్యను స్వేచ్ఛగా చెప్పే విధంగా సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు పిల్లల ప్రవర్తనలో అకస్మాత్తుగా మార్పులు గాయాలు భయం లేదా అనుమానాస్పద స్థితులు కనిపించేటప్పుడు వాటిని గుర్తించి తగిన సమాచారాన్ని అధికారులకు అందించాల్సిన బాధ్యత మీపై ఉందని తెలిపారు. ముఖ్యంగా సైబర్ భద్రతలో పిల్లల మొబైల్ ఫోన్లు సోషల్ మీడియాను ఉపయోగించే సమయంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సరియైన పర్యవేక్షణ చేయాలని సూచించారు అపరిచిత వ్యక్తులతో ఆన్లైన్లో పరిచయాలు వ్యక్తిగత ఫోటోలు సమాచారాన్ని చేరవేరాదని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# స్థానిక సంస్థల సమరానికి వైసిపి శ్రేణులు సిద్ధం కావాలి...!

- కొయ్యూరు ఎంపీపీ బడుగు రమేష్ బాబు పిలుపు...
- మండల కేంద్రంలో జరిగే వైస్సార్ పార్టీ విస్తృత స్థాయి సమావేసాన్ని విజయవంతం చేయండి...
- ముఖ్య అతిథి. పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు రాక


**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 25 :**మండల కేంద్రంలో జరిగే వైయస్సార్సీపి విస్తృతస్థాయి సమావేశం విజయవంతం చేయాలని ఎంపీపీ బడుగు రమేష్ బాబు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 10గంటలకు కొయ్యూరు మండల కేంద్రంలో వైఎస్సార్సీపీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుంది అని

ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం స్థానిక సంస్థల బలోపేతం మరియు పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు కొయ్యూరు మండల కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధుల కీలక సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమానికి పాడేరు నియోజకవర్గ శాసనసభ్యులు, జిల్లా ఇంచార్జ్ మత్స్యరాస విశ్వేశ్వర రాజు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని ఎంపీపీ బడుగు రమేష్లి ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లు గడిచిన కనీసం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అబద్ధాలతో ప్రజలకు మోసం చేయడమే కాకుండా, జగనన్న ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు పేర్లు మార్చి కొద్ది గొప్ప అమలు చేసి డప్పుకొట్టుకుంటున్నారు, కావున గ్రామ కమిటీ సభ్యులు ప్రతి గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలుపై తెలియజేసి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గత ఎన్నికల్లో ఎలా విజయాలు సాధించుకున్నామో అదే విధంగా కార్యకర్తలకు మరెంతో జోష్ పెంచుతూ, మన కొయ్యూరు మండలంలో వైఎస్ఆర్ పార్టీ బలంగా ఉన్నందున ప్రతి పంచాయితీల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగర వేసేవిధంగా కార్యకర్తలను ఉత్తేజపరచడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం అని ఎంపీపీ రమేష్ అన్నారు. కావున

ఈ సమావేశనికి మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని స్థానిక అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు.

మండలంలోని , మండల పార్టీ అధ్యక్షులు,వైస్ ఎంపిపి లు, ఎంపిటిసి సభ్యులు, రాష్ట్ర, జిల్లా, మండల మరియు అనుబంధ విభాగాల సభ్యులు, మహిళా సభ్యులు, సర్పంచుల ఫోరమ్ మాజీ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, అలాగే వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మాజీ వాలంటీర్లు మరియు గృహ సారథులు అందరూ అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ పిలుపునిచ్చారు.






## చింతపల్లిలో 27న మెగా జాబ్ మేళా

- పది ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు..
- నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి



**స్టాఫ్ రిపోర్టర్, పాడేరు, పెన్ పవర్, ఆగస్టు 25:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 27న చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారులు తెలిపారు. సుమారు పది ప్రముఖ కంపెనీలు మేళాలో పాల్గొని వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువత జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.మెగా జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ టి. నిశాంతి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతకు జాబ్ మేళాలు మంచి అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు. యువత అధిక సంఖ్యలో పాల్గొని అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగాలను ఎంపిక చేసుకుని భవిష్యత్తులో మంచి కెరీర్‌ను నిర్మించుకోవాలని ఆకాంక్షించారు.జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి. ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు.

## వై.బి. పట్నంలో విద్యుత్ షాక్‌తో తాపీ మేస్త్రీ మృతి.....

సిమెంట్ తొలగిస్తుండగా విద్యుత్ వైర్‌ను తాకడంతో ప్రమాదం....



**నాతవరం,పెన్ పవర్ (ఆగస్టు 25):** నాతవరం మండలం వై.బి. పట్నం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై తాపీ మేస్త్రీ తంగేళ్ల శ్రీనివాసరావు (37) మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం (ఆగస్టు 24) సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా తుని మండలం మరువాడ గ్రామానికి చెందిన తంగేళ్ల శ్రీనివాసరావు వై.బి. పట్నం గ్రామానికి చెందిన గొల్లి అప్పారావు ఇంటి నిర్మాణ పనులను కాంట్రాక్టు తీసుకుని కొంతమంది మేస్త్రీలు, కూలీలతో కలిసి పనులు నిర్వహిస్తున్నాడు. గత రెండు రోజులుగా కూలీలు పనికి రాకపోవడంతో శ్రీనివాసరావు స్వయంగా సిమెంట్ కలపడంతో పాటు ఇంటిలో పడిపోయిన సిమెంట్‌ను తొలగించే పనులు చేస్తున్నాడు.ఇంటిలో వెలుతురు తక్కువగా ఉండటంతో వైర్ ద్వారా బల్బును ఏర్పాటు చేసుకున్నాడు. సిమెంట్‌ను తొలగించే క్రమంలో అక్కడ ఉన్న విద్యుత్ వైర్‌ను పక్కకు తప్పించేందుకు చేతితో పట్టుకోగా ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు.ఈ ఘటనను గమనించిన మేస్త్రీలు ఉరుకుట్టు నానాజీ, ఉరుకుట్టు సతీష్, కురం దాస్ నాగ గోవిందు వెంటనే జూ= చేసి శ్రీనివాసరావును కాపాడేందుకు ప్రయత్నించారు. అనంతరం గ్రామ పెద్దలకు సమాచారం అందించగా కుంద్రాపు పైడయ్య నాయుడు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది శ్రీనివాసరావు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్సై తారకేశ్వరరావు మంగళవారం వివరాలు వెల్లడించారు.

## 27న జీకేవీధిలో వైసీపీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం

### స్థానిక ఎన్నికలకు వైసీపీ సన్నద్ధం

### ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, ఆగస్టు 25:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వైసీపీ జీకేవీధి మండల శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు ఈ నెల 27న ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్ తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే, అల్లూరి జిల్లా వైసీపీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు సమావేశానికి హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు.జీకేవీధి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న కళ్యాణ మండపంలో గురువారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించడం సమావేశం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.సమావేశానికి ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మండల ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, పంచాయతీ పార్టీ అధ్యక్షులు, బీఎల్ఏలు, మాజీ ఏఎంసీ, పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, మాజీ వార్డు సభ్యులు, మాజీ గ్రామ వాలంటీర్లు హాజరు కావాలని కోరారు. పార్టీ అనుబంధ సంఘాల పంచాయతీ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, కార్యకర్తలు, వైసీపీ అభిమానులు సైతం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రతి పంచాయతీ నుంచి 30 నుంచి 50 మంది వరకు కమిటీ సభ్యులు సమావేశానికి తరలివచ్చేలా పంచాయతీ పార్టీ అధ్యక్షులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్ కోరారు.



## పీకే గూడెంలో సీసీ కెమెరాల ఏర్పాటు....

నేరాల నియంత్రణకు గ్రామస్తుల స్వచ్ఛంద ముందడుగు.....

**నాతవరం, పెన్ పవర్ (ఆగస్టు 25):** పోలీసుల సూచనల మేరకు నేరాల నియంత్రణ, గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నాతవరం మండలం పీకే గూడెం గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.మంగళవారం గ్రామంలో శ్రీ తలుపులమ్మ తల్లి పండుగ సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలోని మూడు రోడ్ల జంక్షన్ వద్ద గ్రామానికి చెందిన గాడి వెంకటరమణ, గ్రామ కమిటీ అధ్యక్షులు అచ్యుత్ వెంకటరమణ, నీటి సంఘం అధ్యక్షులు, ఇతర గ్రామ నాయకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రెండు సీసీ కెమెరాలను శాశ్వతంగా ఏర్పాటు చేశారు.గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ముఖ్యంగా దొంగతనాల అరికట్టడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, భద్రతా పర్యవేక్షణకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని పోలీసు అధికారులు తెలిపారు.ఇదే విధంగా ప్రతి గ్రామంలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని పోలీసులు కోరారు.



## ఆగస్టు 31లోపు పీఎంఎఫ్‌బీవై (ఫ్రూవీఖీద్‌)లో నమోదు చేసుకోవాలి....




**మండల వ్యవసాయ అధికారి జి. సుగుణ...**

**నాతవరం, పెన్ పవర్ (ఆగస్టు 25):** మండలంలో గల గన్నవరం, మన్యపురట్ల రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం "పొలం పిలుస్తుంది" కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులకు పంట సాగు, ఎరువుల యాజమాన్యం,పంట బీమాపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి జి. సుగుణ మాట్లాడుతూ.. వరి పంట వేసిన,వేయబోయే రైతులందరూ ఆగస్టు 31వ తేదీలోపు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (ఫ్రూవీఖీద్) లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.వరి పంట సాగు చేసిన రైతులందరూ పంట బీమా పథకంలో నమోదు చేసుకుని ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయినప్పుడు ఆర్థిక రక్షణ పొందాలని తెలిపారు.అలాగే వరి పంటలో సమగ్ర ఎరువుల యాజమాన్యాన్ని పాటించాలని, పంట అవసరాలకు అనుగుణంగా ఎరువులను సమతుల్యంగా వినియోగించాలని రైతులకు సూచించారు.వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని ఆమె కోరారు.

## ఓబిసి , బి సి మండల్ చైర్మన్ మండల్ జయంతి వేడుకలు



**కూర్మన్న పాలెం :పెన్ పవర్ ,ఆగస్టు 25** బి,సి, పోరాట యోధులు, బీసీల అభ్యుదయానికై ,బీసీలకు రిజర్వేషన్ పెంచాలని బిసి లు అన్ని విధాల ముందు ఉండాలని ఆలోచనతో నిరంతరం బీసీల ధ్యేయంగా అహర్నిశాల కష్టపడ్డా బడుగు బలహీన వర్గాల స్ఫూర్తి దాతలు , బీహార్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఓబిసి , బి సి మండల్ చైర్మన్ బి. పి. మండల్ జయంతి సందర్భంగా, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు , గాజువాక నియోజకవర్గం శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు గాజువాక తెలుగుదేశం పార్టీ ఆఫీసులో బి,పి ,మండల్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళు లు అర్పించారు . బీసీ కులాలకు చేసిన కృషి నేటి తరం స్మరించుకోవాలని వారి పోరాటం బీసీ వెనుకబడిన కులాలుకు ప్రతి వ్యవస్థలో స్థానం కల్పించాలని చేసిన పోరాటానికి ప్రతిఫలం , నాడు ఎన్ టి రామారావు బీసీలను అక్కున చేర్చుకుని తగిన స్థానం కల్పించారని, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం బి. సి బిల్లు విజయం సాధించిన సాధించకపోయినా తెలుగుదేశం పార్టీ బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించడం హర్షనీయమని తెలుగుదేశం పార్టీని ఆదర్శంగా తీసుకొని పలు పార్టీలు స్థానం కల్పించాలని, మహానేతకు ఘన నివాళులు అర్పించారు , కార్యక్రమంలో గాజువాక నియోజవర్గం సమన్వయకర్త రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్ సూచనలతో గాజువాక నియోజవర్గం బీసీ సెల్ ఆధ్వర్యంలో , ఏర్పాటు చేశారు . రాష్ట్ర సెక్రెటరీ మాజీ కార్పొరేటర్ బోండా జగన్ , సీనియర్ టిడిపి నాయకుడు ఎల్లపు ప్రసాద్ పాల్, బీసీ అధ్యక్షుడు తమ్మిరే శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి సత్యారావు, మార్కెటింగ్ డైరెక్టర్, సువర్ణపుడి రాంబాయి, 87వ టిడిపి అధ్యక్షుడు విజయరామరాజు, ప్రధాన కార్యదర్శి బుట్ట ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో వైసీపీదే విజయం

గూడెంకొత్తవీధిలో అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యం



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, ఆగస్టు 25:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గూడెంకొత్తవీధి మండలంలో సర్పంచ్, ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర వైసీపీ పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్ తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే, అల్లూరి జిల్లా వైసీపీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు నాయకత్వంలో అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామని ఓ ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు.మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గిరిజన ప్రజలు ఇప్పటికీ గుర్తుంచుకున్నారని లక్ష్మణ్ పేర్కొన్నారు. పాడేరు నియోజకవర్గంలో గత రెండు ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు అండగా నిలిచారని, అదే ఆదరణ రానున్న స్థానిక ఎన్నికల్లోనూ కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.వైసీపీ శ్రేణులంతా ఐక్యంగా, సమన్వయంతో పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గెలుపును వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు కానుకగా అందించాలని పార్టీ శ్రేణులను కోరారు.

## 14.7 కేజీల గంజాయి హషీష్ ఆయిల్ స్వాధీనం

- ఐదుగురు స్మగ్లర్లు అరెస్ట్
- ఆటో, రెండు బైక్ లు సీజ్
- మీడియా సమావేశంలో డి.ఎస్.పి శ్రీనివాసరావు



**నర్సీపట్నం, పెన్ పవర్ (ఆగస్టు 25) :** ఒడిశా నుంచి మైదాన ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్న 14.7 కేజీల గంజాయి హషీష్ ఆయిల్‌ను గొలుగొండ పోలీసులు స్వాధీనం చేసుకుని, ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. పట్టుబడిన హషీష్ ఆయిల్ విలువ సుమారు రూ.1.83 కోట్లు ఉంటుందని నర్సీపట్నం డీఎస్పీ పి. శ్రీనివాసరావు మీడియా సమావేశంలో తెలిపారు. జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా, ఈగల్ ఇంటెలిజెన్స్ నుంచి అందిన సమాచారంతో డీఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ సీఐ రేవతమ్మ, గొలుగొండ ఎస్ఐ రామారావు, నర్సీపట్నం రూరల్ ఎస్ఐ రాజారావు, కేడీపేట ఎస్ఐ రిషికేష్ సిబ్బందితో కలిసి చెన్నయ్యపాలెం శివారులో నిఘా ఏర్పాటు చేశారు. అటవీ ప్రాంతం నుంచి వస్తున్న ఓ ఆటో, రెండు ద్విచక్ర వాహనాలను తనిఖీ చేయగా హషీష్ ఆయిల్ తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు రెడ్డి నరసింహమూర్తి, అంకిరెడ్డి నానాజీ, కొర్రా వెంకట్రావు, బాకురి లోవలక్ష్మి, కొర్రా సాయి అని పోలీసులు తెలిపారు.

నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న వాహనాలు, సెల్‌ఫోన్ల విలువ సుమారు రూ.7 లక్షలు ఉంటుందని తెలిపారు.

## పార్టీ ఆదేశిస్తే స్థానిక ఎన్నికల్లో పోటీకి సిద్ధం

- అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యం
- బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి అచ్యుత్



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, ఆగస్టు 25**: బీజేపీ అధిష్ఠానం ఆదేశిస్తే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆ పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి చల్లంగి అచ్యుత్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2009లో కురుస భోజయ్య నాయకత్వంలో బీజేపీ సిద్ధాంతాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు అచ్యుత్ తెలిపారు. అప్పటి నుంచి పార్టీకి విధేయుడిగా ఉంటూ పార్టీ బలోపేతం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. తన సేవలను గుర్తించిన పార్టీ అధిష్ఠానం రాష్ట్ర బీజేపీ గిరిజన మోర్చా కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిందని, ఈ అవకాశం కల్పించిన పార్టీ పెద్దలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ఆదేశిస్తే అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయాన్ని శిరసావహిస్తూ, పార్టీ అప్పగించే ఏ బాధ్యతనైనా నిబద్ధతతో నిర్వహిస్తానని అచ్యుత్ పేర్కొన్నారు.

## ఎల్ నినో ప్రభావానికి అనుగుణంగా ప్రకృతి వ్యవసాయం చేయాలి.



**గుమ్మ లక్ష్మీపురం ఆగస్టు 25 పెన్ పవర్.**మండలంలో మండల వ్యవసాయ అధికారి కార్యాలయం వద్ద వ్యవసాయ అధికారి శంకర రావు మరియు ఎం.ఎం.ఈ.ఎల్ గణేష్ శరత్ చంద్ర ఆధ్వర్యంలో మండలంలో ఉన్న అన్నీ గ్రామ సంఘాల నుంచి వచ్చిన పాయింట్ రైతులకు 24,25,లలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ మేరకు గణేష్ శంకర్ చంద్ర మాట్లాడుతూ,ప్రకృతి వ్యవసాయ పద్ధతులు,ఎల్ నినో ప్రభావానికి అనుగుణంగా తక్కువ నీటితో పండే అపరాల పంటలు,చిరు ధాన్యాలను విత్తన గుళికలుగ తయారు చేయి పద్ధతి గురించి,అలాగే తక్కువ వర్షపతనికి మొలకలు వస్తాయని చెప్తూ,ఎటిఎం మోడల్ ను పరిశీలించి,రేగులపాడు గ్రామంలోగల దీప బి.ఆర్.సి సెంటర్ నందు ఘన,ద్రవ జీవామృతలు,దశపర్ని మరియు అగ్నస్త్రం తయారు చేయడం జరిగిందన్నారు.రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని తద్వారా పెట్టుబడి తగ్గి,మంచి దిగుబదులు వస్తాయని ఆరోగ్యకరమైన నాణ్యమైన రసాయన రహిత పంటలను పండించి అధిక దిగుబడులను సాధించాలని బయో రిసెర్ సెంటర్లో ప్రకృతి వ్యవసాయ సంబంధించిన కషాయాలను తయారు చేయించి అందుబాటులో ఉండే విధంగా చూడాలని శిక్షణకు వచ్చిన పాయింట్ వ్యక్తులకు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు.ట్రైనింగ్ లో నేర్చుకున్న విషయాలను రైతులకు చేరువ చేయాలని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో బిఆర్సి రిసోర్స్ పర్సన్స్,అన్ని గ్రామాల నుంచి వచ్చిన పాయింట్ పర్సన్స్ పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో దళిత,గిరిజనులకు తీవ్ర అన్యాయం.

సామాజిక న్యాయానికి పాతర.

**గుమ్మలక్ష్మీపురం ఆగస్టు 25 పెన్ పవర్.**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దళిత,గిరిజనుల ఆత్మగౌరవాన్ని,హక్కులను ఈ కూటమి ప్రభుత్వం నిలువునా తొక్కిపెడుతోంది.ఎన్నికల ముందు సూపర్ సిక్స్,సామాజిక సాధికారత అంటూ గొప్పలు చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబు ప్రభుత్వం,అధికారంలోకి రాగానే బడుగు,బలహీన వర్గాల సంక్షేమాన్ని గాలికొదిలేసింది.రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు పూర్తి వ్యతిరేకంగా పరిపాలనచేస్తుంది కూటమి ప్రభుత్వం అని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి యువజన విభాగం నిమ్మక గోపాల్ మండిపడ్డారు.మంగళవారం నాడు గుమ్మలక్ష్మీపురం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ,వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో డీబీటీనాన్–డీబీటీ పథకాల ద్వారా ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ వర్గాల సంక్షేమానికి దాదాపు రు.2.50 లక్షల కోట్లకుపైగానిధులు ఖర్చు చేయడం జరిగిందని

దళిత,గిరిజనుల జీవితాల్లో నిజమైన మార్పు కనిపించిందని అన్నారు.రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ వర్గాలకు చెందిన సుమారు 80 లక్షల మందికి పైగా లబ్ధిదారులుకుటుంబాలకు వివిధ విడతల్లో సంక్షేమ పథకాలు అందాయని అటవీ హక్కుల చట్టం(ఆర్ఓఫ్ ర్)కింద సుమారు1.53 లక్షల మంది గిరిజన రైతులకు దాదాపు3లక్షల ఎకరాల అటవీ భూమిపై సాగు హక్కుల పట్టాలనుఅందించామని గిరిజనులు సాగు చేసుకుంటున్న సుమారు.31,155 ఎకరాల డీకేటీ భూములకు సంబంధించి19,919గిరిజన కుటుంబాలకు పట్టాలు మంజూరు చేసింది వైసీపీ ప్రభుత్వం అనితెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళిత,గిరిజనుల అభివృద్ధికి కేటాయించాల్సిన సబ్‌ప్లాన్ నిధులు లేవు పేద విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్,వసతి దీవెన నిధులను నిలిపివేసారని ముఖ్యంగా కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీలపై వేధింపులు,దాడులు విపరీతంగా పెరిగాయని మండిపడ్డారు.నిలిపివేసిన ఎస్సీ,ఎస్టీ సంక్షేమ పథకాల నిధులను తక్షణమే విడుదల చేయాలని ?సబ్‌ప్లాన్ చట్టాన్ని తూచా తప్పకుండా అమలు చేయాలని దళిత,గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టి,నిందితులపై ఎస్సీ.ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని లేకుంటే వైస్సార్ కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని గోపాల్ హెచ్చరించారు.



# భోగాపురానికి బస్సులు నడపండి.



- బత్తిలి,భామిని, బలిజిపేట తదితర ప్రాంతాలకు బస్సులు వేయాలి
- ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మరుగుదొడ్లును కాస్త పట్టించుకోండి.
- జిల్లా నలుమూలల నుండి జిల్లా కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించాలి.
- మహిళల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా మెలగాలి.
- జిల్లా రవాణా శాఖను కోరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు.

**పార్వతీపురం ఆగస్టు 25 పెన్ పవర.** ఇటీవల ప్రారంభమైన భోగాపురం విమానాశ్రయానికి పార్వతీపురం నుండి బస్సులు నడపాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.మంగళవారం కాంగ్రెస్ పార్టీ డిసిసి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు,ఓబిసి చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్,ఏవో గంట మోహన్ రావు తదితరులు జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయ అధికారి బి.కృష్ణ కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు ప్రయాణికులకు అందుతున్న ఆర్టీసీ సేవలు వాటి వైఫల్యాలు పై చర్చించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,భోగాపురం విమానాశ్రయానికి డైరెక్ట్ బస్సులు నడపడం ద్వారా ప్రయాణికులకు సౌకర్యాన్ని అందజేయాలన్నారు.డిపో పరిధిలో తిరుగుతున్న డొక్కు బస్సులను మూలన పెట్టి,కొత్త బస్సులు తెప్పించాలన్నారు.డొక్కు బస్సుల ద్వారా ప్రజల ప్రాణాలతో ఆటలాడొద్దన్నారు.ఆర్టీసీ బస్సులు ప్రమాదానికి గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు.బస్సులో ఫిట్ గా ఉండేలా చూడాలన్నారు.గత ఏడాదిలో చోటు చేసుకున్న ఆర్టీసీ రోడ్డు ప్రమాదాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు.ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బస్సులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించేందుకు బత్తిలి,భామిని,బలిజిపేట,పెద బుడ్డిడి,మసిమండ,లంజి తదితర గ్రామాలకు బస్సు సదుపాయం కల్పించాలన్నారు.కాలం చెల్లిన కిలోమీటర్లు పూర్తయిన డొక్కు బస్సులు స్థానంలో డిపోకు అవసరమైన కొత్త బస్సులను వెంటనే తెప్పించాలన్నారు.మహిళలకు ఉచిత బస్సు సదుపాయం తర్వాత రద్దీ పెరిగిందని,ఆ రద్దీని తట్టుకునే విధంగా డిపోకు అవసరమైన బస్సులు,సిబ్బందిని నియమించాలన్నారు.మహిళల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా నడుచుకునేలా చర్యలు చేపట్టాలన్నారు.స్పేర్ పార్టు పుష్కలంగా తెప్పించి బస్సులకు మరమ్మత్తులు చేపట్టాలన్నారు.బస్సులు మార్గమధ్యంలో ఆగిపోకుండా చూడాలన్నారు.రాజమండ్రి,విశాఖపట్నం కి కండిషన్లో ఉన్న బస్సులు నడిపి సకాలంలో ప్రయాణికులు చేరవేయాలన్నారు.డొక్కు బస్సులకు లగ్జరీ చార్జీలు వసూలు చేయరాదన్నారు.బస్సులో టీవీ,సెల్ ఫోన్ చార్జింగ్ తదితర సదుపాయాలు కల్పించాలన్నారు.బస్సులు ఎక్కడబడితే అక్కడ ఆగిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు.మహిళ సిబ్బందికి రెస్ట్ రూమ్ పరిశుభ్రంగా ఉండేలా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలోని పబ్లిక్ మరుగుదొడ్లకు పై కప్పు డోర్లు వెయ్యాలన్నారు.ఇన్ గేట్ వద్ద గల మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు.రాత్రిపూట కాంప్లెక్స్ ప్రాంగణంలో అసాంఘిక చర్యలు జరగకుండా సెక్యూరిటీ ఏర్పాట్లు చేయాలన్నారు.రాత్రిపూట బస్సు నేమ్ బోర్డులు కనిపించేలా నేమ్ బోర్డుల వద్ద లైట్లు ఏర్పాటు చేయాలన్నారు.పాఠశాలలు,కళాశాలలకు వచ్చే విద్యార్థులకు వారి వారి బస్టాపుల్లో బస్సులు ఆపాలన్నారు.పార్వతీపురం జిల్లా కేంద్రం కావడం వలన దాదాపు అన్ని గ్రామాల నుండి జిల్లా కేంద్రానికి ఆర్టీసీ సేవలు అద్దెల చర్యలు చేపట్టాలన్నారు.

## 'రెండేళ్ల నమ్మకం--సంక్షేమం,అభివృద్ధి'ఇంటింటి ప్రచారం.

కార్యక్రమంలో ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే.



**కురుపాం ఆగస్టు 25 పెన్ పవర్.**పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గం కురుపాం మండలం మొండెంఖల్లు గ్రామంలో మంగళవారం నాడు'రెండేళ్ల నమ్మకం--సంక్షేమం,అభివృద్ధి'కార్యక్రమాన్ని నిర్వహించారు.పార్టీ ఆదేశాల మేరకు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కె.వి.కొండయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు.వారి సమస్యలను అడిగి తెలుసుకుని,వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు,చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ప్రజల సంక్షేమం,అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వంపై ప్రజలు చూపిస్తున్న విశ్వాసం తమపై మరింత బాధ్యతను పెంచుతోందని,ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూఅందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు.మొండెంఖల్లు గ్రామంలో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయకో,రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్,రాష్ట్ర ట్రైకర్ బోర్డ్ డైరెక్టర్ పువ్వల లావణ్య,మాజీ సర్పంచ్ లక్ష్మి,నాయకులు,కార్యకర్తలు,మహిళలు,స్థానికులు పాల్గొన్నారు.

## రవాణా సిబ్బందికి యోగా, ఆరోగ్యంపై అవగాహన

- బ్రహ్మకుమారీల ఆధ్యాత్మిక సంస్థ కరపత్రం విడుదల



**విశాఖ దక్షిణం, పెన్ పవర్,ఆగస్టు 25 :**బ్రహ్మకుమారీల ఆధ్యాత్మిక సంస్థ సభ్యులు రూపొందించిన కరపత్రాన్ని మంగళవారం విశాఖపట్నంలోని రీజినల్ మేనేజర్ కార్యాలయంలో విడుదల చేశారు. రీజినల్ మేనేజర్ బి. అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ మాట్లాడుతూ, రవాణా రంగంలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు చెడు వ్యసనాలకు, ముఖ్యంగా మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రతిరోజూ యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా ఏకాగ్ర తను పెంపొందించుకుని విధులను సమర్థవంతంగా, బాధ్య తాయుతంగా నిర్వహించాలని కోరారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు నిర్ణీత బస్టాపుల వద్ద మాత్రమే బస్సులను నిలిపి, ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవా లని అధికారులకు, సిబ్బందికి సూచించారు.

ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ అధికారులు, సిబ్బందితో పాటు బ్రహ్మకుమారీల ఆధ్యాత్మిక సంస్థకు చెందిన 'ఓం శాంతి' సభ్యులు పాల్గొన్నారు.

## గుమ్మిరేవులలో ఓటర్ల జాబితా ప్రచురణ

ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల జాబితా విడుదల



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, ఆగస్టు 25:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం గుమ్మిరేవుల గ్రామపంచాయతీ కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల జాబితాను మంగళవారం ప్రచురించారు. ఎంపీడీవో బీహెచ్‌వీ రమణబాబు, బీఎల్‌ఏలు, సచివాలయ సిబ్బందితో కలిసి జాబితాను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఓటర్ల జాబితాను పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలు లేదా తప్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, బీఎల్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

# క్షణికావేశం.. తీరని శోకం.

- క్షణాల్లో గాలిలో కలిసిపోయిన ప్రాణం. అగమ్య గోచారం పిల్లల భవితవ్యం.
- కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య.
- అనాథలైన ముగ్గురు చిన్నారులు.
- చింతపల్లిలో తీవ్ర విషాదం.

**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 25.**భార్యాభర్తల మధ్య తలెత్తిన చిన్నపాటి వివాదాలు ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. క్షణికావేశంలో తల్లి తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో ముగ్గురు పసిపిల్లలు అనాథలుగా మారిన విషాద ఘటన చింతపల్లి మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రాథమిక వివరాల ప్రకారం, చింతపల్లి మండల కేంద్రంలోని మెట్టబంగ్లా (దోమలగొంది) ప్రాంతానికి చెందిన పాగి కొండమ్మ, తన భర్త శివతో కలిసి నివాసం ఉంటోంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గత కొద్ది రోజులుగా ఈ దంపతుల మధ్య కుటుంబ కలహాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇరువురి మధ్య తరచూ వాగ్వాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మంగళవారం సాయంత్రం మనస్తాపానికి గురైన కొండమ్మ, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఇది గమనించిన స్థానికులు వెంటనే ఆమెను కిందకు దించి ప్రాణాలు కాపాడేందుకు హుటాహుటిన చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కొండమ్మ మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లి మృతదేహం వద్ద ఆ ముగ్గురు పసిపిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు అక్కడి వారిని తీవ్రంగా కలచివేసింది. ఆసుపత్రి వర్గాల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలో భద్రపరిచారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# గణబాబు కృషితో నిర్వాసితులకు భూ హక్కు పత్రాలు

- 22-ఏ జాబితా నుంచి స్థలాల తొలగింపునకు చర్యలు
- రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం
- దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న నిర్వాసితుల సమస్యకు పరిష్కారం
- గ్రామభ్యుదయ యువజన సేవా సంఘం అధ్యక్షులు నందవరపు సోములు




**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఆగస్టు 25 :** దాదాపు ఐదు దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని పద్మనాభ నగర్ నిర్వాసితుల భూ హక్కుల సమస్యకు పరిష్కారం లభించే దిశగా అడుగులు పడుతున్నాయని పద్మనాభ నగర్ గ్రామభ్యుదయ యువజన సేవా సంఘం అధ్యక్షులు నందవరపు సోములు తెలిపారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు ప్రత్యేక చొరవతో నిర్వాసితుల ఇళ్ల స్థలాలను 22-ఏ జాబితా నుంచి తొలగించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖపట్నం 92వ వార్డు పరిధిలోని పద్మనాభ నగర్ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో నందవరపు సోములు మాట్లాడుతూ.. 1976లో మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నిర్మాణం కోసం తమ ఇళ్లు, పంట పొలాలను త్యాగం చేసిన కుటుంబాలకు పునరావాసంలో భాగంగా పద్మనాభ నగర్ లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించారని వివరించారు. అయితే, అప్పట్లో నిర్వాసితులకు ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్లు (ఎల్‌పీసీలు) మాత్రమే ఇవ్వడంతో, స్థలాలపై పూర్తి హక్కులు కల్పించే రిజిస్ట్రేషన్ ప్రక్రియ మాత్రం పూర్తికాలేదన్నారు. దీంతో అనేక సంవత్సరాలుగా నిర్వాసితులు తమ స్థలాల రిజిస్ట్రేషన్ కోసం అధికారులను ఆశ్రయిస్తున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. ప్రస్తుతం ఎమ్మెల్యే గణబాబు నిర్వాసితుల సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించి, స్థానిక రెవెన్యూ అధికారులతో సర్వే నిర్వహించడంతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను పలుమార్లు తీసుకెళ్లారని సోములు తెలిపారు. వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు కంపర అప్పారావు మాట్లాడుతూ.. 1976లో మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నిర్వాసితులకు వెంకటాపురం సర్వే నంబర్ 76లో ఒక్కొక్కరికి 240 చదరపు గజాలు అంటే ఐదు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించారని తెలిపారు. అయితే వాటికి ఎల్‌పీసీలు మాత్రమే జారీ చేశారని, రిజిస్ట్రేషన్ పట్టాల కోసం నిర్వాసితులు దశాబ్దాలుగా అధికారులను కలుస్తూనే ఉన్నారని చెప్పారు. ప్రస్తుత ఎమ్మెల్యే గణబాబును పద్మనాభ నగర్ గ్రామస్తులు కలిసి తమ సమస్యను వివరించడంతో ఆయన స్పందించి, స్థానిక తహసీల్దార్ ద్వారా సమగ్ర సర్వే చేయించారని తెలిపారు. నిర్వాసితుల పరిస్థితిని జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు వివరించి, రిజిస్ట్రేషన్‌కు ఉన్న అడ్డంకులను తొలగించేలా చర్యలు తీసుకుంటున్నారని కంపర అప్పారావు పేర్కొన్నారు. గౌరవాధ్యక్షులు సాలాపు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పద్మనాభ నగర్‌లో సుమారు 105 ఎకరాల పరిధిలో అప్పట్లో 320 మంది నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. ఆ సమయంలో కొంతమంది తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోగా, ఆర్థిక పరిస్థితులు అనుకూలించని మరికొందరు తమ స్థలాలను ఇతరులకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే ఒక కుటుంబానికి కేటాయించిన స్థలం తర్వాతి తరాల్లో వారసుల మధ్య విభజనకు గురైందని వివరించారు. ఒకే స్థలంలో ఇద్దరు, నలుగురు అన్నదమ్ములు వేర్వేరుగా ఇళ్లు నిర్మించుకోవడం, కొందరు ఒకే స్థలాన్ని కుటుంబ సభ్యుల మధ్య నాలుగు భాగాలుగా పంచుకోవడం వంటి పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. ప్రస్తుతం పద్మనాభ నగర్‌లో సుమారు 500కు పైగా ఇళ్లు ఉన్నాయని, మరికొన్ని ఖాళీ స్థలాల్లో భవిష్యత్తులో ఇళ్లు నిర్మించాల్సి ఉందని చెప్పారు. అందువల్ల ప్రస్తుత నివాసితుల పరిస్థితిని, వారసత్వంగా ఏర్పడిన హక్కులను, స్థలాల విభజన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సాలాపు శ్రీనివాసరావు కోరారు. రిజర్వాయర్ నిర్మాణం కోసం తమ పూర్వీకులు భూములు, ఇళ్లను త్యాగం చేసి దాదాపు 50 సంవత్సరాలు గడిచినా, స్థలాలపై పూర్తి స్థాయి హక్కులు పొందలేకపోవడం నిర్వాసిత కుటుంబాలకు ఇబ్బందికరంగా మారిందని సమావేశంలో పలువురు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం, రెవెన్యూ యంత్రాంగం తీసుకుంటున్న చర్యలతో తమ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నిర్వాసితులు ఆశాభావం వ్యక్తం చేశారు. 22-ఏ జాబితా నుంచి స్థలాలను తొలగించి, చట్టపరమైన అడ్డంకులను పరిష్కరించి, అర్హులైన నిర్వాసితులు మరియు ప్రస్తుత హక్కుదారులకు భూ హక్కు పత్రాలు అందించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సంఘ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కంచిపాటి వెంకటరమణ, వల్లూరి జగదీష్ చంద్రశేఖర్, రొంగలి ప్రసాద్, కంచిపాటి నాగరాజు, కొల్లిపాక వెంకటరమణ, కే. పెంటయ్య, కంపర నర్సింగరావు, గొల్లవిల్లి వెంకట్రావు, నందవరపు హరనాథ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నాగేశ్వరరావు, మనోజ్ కుమార్, నందం అప్పారావు, గని శెట్టి శ్రీనివాసరావు, గౌరీ ప్రసాద్, మడక భాస్కరరావు, ఏ. మోహన్ రావు, రాయుడు, ఏ.వి. సూర్యనారాయణ, ఎం. వెంకట్రావు, ఆర్. సూరిబాబు తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఘనంగా శ్రీ నర్సింగ బిల్లమ్మ అమ్మవారి పండుగ మహోత్సవం

- అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న బెహరా భాస్కరరావు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఆగస్టు 25 :** జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో శ్రీ నర్సింగ బిల్లమ్మ అమ్మవారి పండుగ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించగా, స్థానికంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, వెంకటాపురం ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అందించిన తీర్థప్రసాదాలను స్వీకరించారు. స్థానిక ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు, సంప్రదాయాలకు ప్రతీకగా నర్సింగ బిల్లమ్మ అమ్మవారి పండుగను ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. పండుగ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఉప్పిలి కనకరాజు, పీతల అప్పలరాజు, దాలిబోయిన శంకర్రావు, పల్లా సూరిబాబు, ఉరుకూటి అప్పలరాజు, నూనెల రాజు, నూనెల వెంకటరమణ, నూనెల గౌరీతో పాటు పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

## వి బి జి రామ్ పథకం ద్వారా గాదెగుంటకు రహదారి నిర్మాణానికి చర్యలు. ఏపీఓ కొండబాబు




**జి.మాడుగుల పెన్ పవర్ ఆగస్టు 25 :** జి మాడుగుల మండలం నుర్మతి పంచాయతీ గాదెగుంట గ్రామానికి రహదారి సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీవో కొండబాబు తెలిపారు. మంగళవారం సిబ్బందితో కలిసి గ్రామాన్ని సందర్శించి రహదారి పరిస్థితిని పరిశీలించారు. గతంలో వేసిన మెటల్ రహదారి ఉందని, గ్రామస్తులు శ్రమదానంతో అభివృద్ధి చేసుకున్న మార్గానికి వి.బి.జి. రామ్ పథకం ద్వారా రహదారి సదుపాయం కల్పిస్తామని తెలిపారు. గ్రామస్తులు బీటీ రహదారి నిర్మించాలని కోరగా, మెటల్ వేసిన రహదారికి పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి బీటీ రహదారి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, వీఆర్‌పీలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పిజి ఆర్ఎస్ ) ద్వారా 64 అర్జీలు స్వీకారణ.



**జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ.**

**అరకులోయ పెన్ పవర్ ఆగస్టు 25:** అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకువేలి మండలంలోని గన్నెల స్వర్ణ గ్రామ సచివాలయ కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిషాంతి. టీ వారి ఆదేశాలు మేరకు ఏర్పాటు చేయడం జరిగింది.

గ్రామంలోని ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి త్వరితగతిన పరిష్కారం అందించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని జిల్లా జాయింట్ తిరుమని శ్రీపూజ పేర్కొన్నారు.

మంగళవారం గేన్నెల స్వర్ణ గ్రామం లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా

సమస్యల స్వీకరణ కొరకు గ్రామస్తులనుండి అర్జీలను స్వీకరించరు. ఈ పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో రెవిన్యూ, తాగునీరు, రహదారులు, స్కూల్ అంగన్వాడి భావనలు,విద్యుత్, డ్రైనేజీ, పింఛన్లు ఇతర వ్యక్తిగత సంక్షేమ పథకాలకు సంబంధించిన అర్జీలను అధికారులకు సమర్పించారు. గ్రామ స్థాయిలో వచ్చిన అర్జీలు

త్వరితగా ఫీల్డ్ స్థాయి లో పరిశీలించి పరిష్కారించాలని,స్కూల్, అంగన్వాడీ భావనకు సంబందించిన పనులు ఏ స్టేజ్ లో పరిశీలించి నివేదిక సిద్ధం చేసుకోవాలని, మిగిలిన శాఖలు స్వీకరించిన అర్జీలను వెంటనే పరిశీలించి, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తారని తెలిపారు .ఈరోజు వచ్చిన అర్జీలు రెండోవ రోజు జరగబోయే పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో పరిస్కరం చూపేవిదంగా తెలియజేస్తారని వివరించారు .చదువుకున్న యువత స్వయం ఉపాధి, స్కిల్ కు సంబందించిన ఉపాధి వైపు మొగ్గు చూపాలని ప్రభుత్వం విద్య అర్హతను బట్టి శిక్షణలు తీసుకొని ఉపాధి పొందాలని తెలిపారు.

గన్నెల గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేయాల్సిందిగా తెలిపారు. ఈ పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఆర్డిఓ భుజంగరావు, ఐటీడీఏ ఏపిఓ ఎం వెంకటేశ్వరావు, డీపీఓ కె. పి. చంద్ర శేఖర్,డిఇఓ,డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పి బి కె పరిమళ, పీడీ డిఆర్డిఏ, ఏడి సర్వే, డిఎల్పిఓ పి. ఎస్. కుమార్,డిఎండ హెఓ రియాజ్ బైగ,డిసిహెఎస్,అదనపు డిఎంహెఓ,పిడీ ఐసీడిఎస్, జిల్లా అటవీ శాఖఅధికారి ఉమామహేశ్వరీ , స్వర్ణ గ్రామ నోడల్ అధికారి సత్యనారాయణ, ఈఈ ఆర్ డబ్ల్యు, ఈఈ పిఆర్, డిఎం ఆర్టీసి, డి ఎం సివిల్ సప్లై, జిల్లా మలేరియా అధికారి,వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, మండల్ తాహశీల్దార్, ఎం పిడిఓ, పోలీస్ ఇతర జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## శ్రీనిధి రుణాల మంజూరులో వెలుగు సిబ్బంది నిర్లక్ష్యం

**48 గంటల్లో రుణాలంటూ ప్రభుత్వం చెబుతుంటే.. రెండు నెలలుగా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు!**

**ఒకరిపై ఒకరు బాధ్యతలు నెట్టేస్తున్న అధికారులు ఉన్నతాధికారుల తీరుపై మహిళా పొదుపు సంఘాల ఆగ్రహం**



**జి.మాడుగుల.పెన్ పవర్.ఆగస్టు 25.** మండలంలోని జి.మాడుగుల మండల మహిళా సమాఖ్య కార్యాలయం లో ఉన్న సిబ్బంది పనితీరుపై స్వయం సహాయక పొదుపు సంఘాలు

ఆందోళన చేస్తున్నారు.

శ్రీనిధి సమృద్ధి పథకం కింద పొదుపు సంఘాల సభ్యులకు సత్వరమే రుణాలు మంజూరు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ జి.మాడుగుల మహిళా మండల సమాఖ్య వెలుగు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు అందుకు పూర్తి భిన్నంగా ఉందని మహిళా పొదుపు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రుణాల కోసం కార్యాలయం చుట్టూ నెలల తరబడి తిప్పుతూ చివరకు మీరు ఎవరిని కలిశారో వారినే అడిగి తెలుసుకోండి అన్న రీతిలో సమాధానాలు ఇస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. జి.మాడుగుల మండలంలోని చుట్టుమెట్ట గ్రామానికి చెందిన దీవెన స్వయం సహాయక సంఘం (ఎస్ హెచ్ జీ), జి.మాడుగుల వీవో పరిధిలో గత జూన్ 24, 2026న శ్రీనిధి సమృద్ధి సభ్యత్వం కోసం రూ.7,500 చెల్లించినట్లు సభ్యులు తెలిపారు. సభ్యత్వ రుసుము రూ.7,200 కాగా అదనంగా రూ.300 కూడా చెల్లించామని వారు పేర్కొన్నారు.సభ్యత్వం తీసుకుని దాదాపు రెండు నెలలు గడుస్తున్నా రుణం మంజూరు కాకపోవడంతో వీవోఏను సంప్రదిస్తే సీసీని అడగండి అని, సీసీని అడిగితే వీవోఏను అడగాలి అంటూ ఒకరిపై ఒకరు బాధ్యతలు నెట్టుకుంటున్నారని మహిళలు వాపోతున్నారు.ప్రభుత్వం ప్రకారం శ్రీనిధి సమృద్ధి పొదుపు కట్టిన అనంతరం 48 గంటల్లోనే రుణ మంజూరు ప్రక్రియ సత్వరంగా జరగాల్సి ఉండగా, తమ విషయంలో మాత్రం నెలల తరబడి జాప్యం ఎందుకు జరుగుతోందని మహిళా సంఘాల సభ్యులు ప్రశ్నిస్తున్నారు. వీవోలు మార్చాము అందుకే ఆలస్యం అవుతోంది అంటూ సిబ్బంది సాకులు చెబుతున్నారని వారు ఆరోపించారు.సమస్య పరిష్కారం కోసం ఏపీఎంను సంప్రదించగా ఇది సీసీ, వీవోఏలు చేయాల్సిన పని

దీనితో నాకు సంబంధం లేదు అన్నట్లుగా సమాధానం ఇచ్చారని సభ్యులు తెలిపారు. అంతేకాకుండా డీపీఎంను అడిగి తెలుసుకోవాలని సూచించారని పేర్కొన్నారు. ఇదే విషయమై విలేకరి ఏపీఎంను ప్రశ్నించగా డీపీఎం తిలక్‌ను అడిగి తెలుసుకోవాలని చెప్పడం అధికారుల బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోందని మహిళలు మండిపడుతున్నారు.వీవోఏను అడిగితే సీసీని అడగాలని సీసీని అడిగితే డీపీఎంను అడగాలని చెప్పడం. చివరకు అసలు బాధ్యత ఎవరిది అంటూ సభ్యులు నిలదీస్తున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు పరస్పరం బాధ్యతలు తప్పించుకుంటూ ఆదివాసీ మహిళలను కార్యాలయాల చుట్టూ తిప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.కిందిస్థాయి సిబ్బంది చేయాల్సిన పనిపై పైస్థాయి అధికారులు పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, ఒకరిపై ఒకరు నెపం నెట్టుకోవడం వెనుక ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యానికి బాధ్యులెవరో తేల్చి, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.శ్రీనిధి రుణాల మంజూరులో జరుగుతున్న జాప్యంపై జిల్లా స్థాయి అధికారులు తక్షణమే స్పందించి, దీవెన స్వయం సహాయక సంఘం సభ్యులకు న్యాయం చేయడంతో పాటు, రుణ మంజూరు ప్రక్రియ ఎందుకు నిలిచిపోయిందనే విషయంపై పూర్తి స్థాయి విచారణ జరిపి స్పష్టమైన వివరణ ఇవ్వాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.

వారం రోజుల్లో రుణాలు మంజూరు చేస్తాం డిపిఎం

ఈ విషయంపై డిపిఎం కు వివరణ కోరగా జిమాడుగులలో ఒక వివో ను రెండు వివో లుగా విభజించామని రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందని అయితే వివో ఏ లకు ఇంకా బాధ్యతలు అప్పగించలేదని తెలిపారు. వారం రోజుల్లో రుణాలు మంజూరు చేసి అందజేస్తామని వివరణ ఇచ్చారు.

## ప్రజల ముంగిటకే ప్రభుత్వ సంక్షేమం

- అరకు ఇంచార్జ్ ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర.
- అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు మోజురు తేజోవతి.




**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 26.** మండల కేంద్రంలో కూటమి నాయకులు, కార్యకర్తలు నిర్వహించిన రెండేళ్ల నమ్మకం సంక్షేమం, అభివృద్ధిఇంటింటి ప్రచార కార్యక్రమంలో అరకు నియోజకవర్గం ఇంచార్జ్ ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర, అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు మోజురు తేజోవతిలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మంగళవారం ఈ సందర్బంగా ప్రతి ఇంటి ముందూ ఆప్యాయంగా ఆగి, కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ, ప్రభుత్వ పథకాలు అందుతున్న లెవా అని అడిగితెలుసుకొన్నారు, కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ వివరాలతో కూడిన కరపత్రాలను ప్రతి కుటుంబానికి అందజేశారు. కేవలం సంక్షేమ పథకాల ప్రచారమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను స్వయంగా తెలుసుకొని అధికారులతో మాట్లాడి పరిష్కరానికి కృషి చేస్తాము అని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తూ,ప్రజల బాగోగులు సమస్యలు, తెలుసు కొనేందుకు ఇంటిటికి తెలుగుదేశం పార్టీ ఈ కార్యక్రమానికి రూపొందించి, ప్రతి ఒక్క పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అరకు మార్కెటింగ్ చైర్మన్ బోరిబోరి లక్ష్మి, ముంచంగిపుట్టు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ, కార్యదర్శి కొంతేరి జాగత్రాయ్, అరకు పార్లమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పాంగి కామేష్, పి ఏ సి ఎస్ చైర్మన్ సామల బాబుజి పి శాస్త్రి బాబు నీలకంఠ పాత్రో కె బలరాం ఏం చిన్ని బాబు, కె రామారావు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వాహన రికార్డులు తప్పనిసరి మైనర్లకు బండ్లు అప్పగిస్తే కఠిన చర్యలు.సిఐ లక్ష్మణరావు



**జి.మాడుగుల.పెన్ పవర్.ఆగస్టు 25.** వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ వాహన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సుతో పాటు ఇతర అవసరమైన ధ్రువపత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని మైనర్లకు వాహనాల అప్పగిస్తే కఠిన చర్యలు ఉంటాయని సీఐ లక్ష్మణరావు సూచించారు. జి.మాడుగుల మండల కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, ట్రిపుల్ రైడింగ్‌కు పాల్పడవద్దని సూచించారు. లైసెన్సు, వాహన రికార్డులు తదితర పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై సాయిరాం పడాల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి



**జి.మాడుగుల: పెన్ పవర్ ఆగస్ట్ 25** రహదారి పక్కన పశువుల కోసం ఎదురుచూస్తున్న వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన జి.మాడుగుల మండలంలో చోటుచేసుకుంది. జి.ఎం.కొత్తూరు గ్రామానికి చెందిన గడుగు కొండబాబు (55) రహదారి పక్కన నిల్చొని మేరకు వెళ్లిన తన పశువుల కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ తరుణంలో అదే గ్రామానికి చెందిన సిదరి వెంకట్ ద్విచక్ర వాహనంపై జి. మాడుగుల వెళ్తూ.. అదుపుతప్పి అతన్ని బలంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో కొండబాబు కు తీవ్ర గాయాలైంది. అతన్ని జి.మాడుగుల ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్య సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిరాం పడాల్ తెలిపారు.

# నెల్లిపూడి పాఠశాలలో శిథిల భవనం.. విద్యార్థుల భద్రతపై ఆందోళన

**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 25:** గంగవరం మండలం నెల్లిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శిథిలావస్థకు చేరిన పాత భవనం విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రమాదకరంగా మారిందని రంపచోడవరం నియోజకవర్గ తెలుగునాడు విద్యార్థి సమాఖ్య (టీఎన్ఎస్ఎఫ్) అధ్యక్షుడు శివ ముచ్చకర్ల ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్నో సంవత్సరాలుగా వినియోగంలో ఉన్న పాత పశువైద్య భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని తెలిపారు. భవనం గోడలు బలహీనంగా మారడంతో పాటు పైకప్పు, తలుపులు, మెట్లు తదితర నిర్మాణాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. భవనం చుట్టూ చెట్లు, వాటి వేర్లు పెరగడంతో నిర్మాణం మరింత బలహీనపడే పరిస్థితి నెలకొందన్నారు.పాఠశాల ఆవరణలోనే శిథిల భవనం ఉండటంతో ఏ సమయంలోనైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని, ముఖ్యంగా విద్యార్థులు ఆడుకునే సమయంలో, పాఠశాల కార్యక్రమాలు జరిగే సందర్భాల్లో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.సంబంధిత శాఖ అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు భవనాన్ని వెంటనే సాంకేతికంగా పరిశీలించాలని శివ ముచ్చకర్ల కోరారు. భవనం ప్రమాదకరంగా ఉన్నట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం తక్షణమే తొలగించి, ఆ స్థలాన్ని విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.అలాగే పాఠశాల ఆవరణలోని ఇతర పాత నిర్మాణాలను కూడా పరిశీలించి, విద్యార్థులకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. విద్యార్థుల భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## ఈనెల 28 నుంచి ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 25:**స్థానిక గౌతమి ఘాట్ వద్ద వేంచేసిఉన్న అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ నుంచి వచ్చే నెల ఐదో తేదీ వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలను నిర్వహిస్తున్నామని ఇస్కాన్ మందిర నిర్వాహకులు తెలిపారు. మంగళవారం మందిర నిర్వాహకులు రవీంద్ర చైతన్య దాస్, మీడియా సమావేశంలో ఉత్సవాల కార్యక్రమాలను వివరించారు. 28 నుంచి 5వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 4:30 గంటల నుంచి మంగళహారతి, దర్శన హారతి,గురుపూజ లతో పాటు సత్య గోపీనాథ్ ప్రభుజి చే శ్రీమద్భాగవత ప్రవచనాలు జరుగుతాయన్నారు. ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు సాయంత్రం వేళల్లో యజ్ఞసేవ, సత్య గోపీనాథ్ ప్రభుజి చే శ్రీకృష్ణ లీలపై ప్రవచనాలు ఉంటాయన్నారు. అనంతరం అనంతరం స్వామి వారి దివ్య వాహన సేవ, ఉంజల సేవ, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 3వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి పోటీల బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందన్నారు. ఈ విజేతలైన విద్యార్థిని విద్యార్థులకు యువతకు మేనేజ్మెంట్ చైర్మన్ సత్య గోపీనాథ్ దాస్, రాజకీయ ప్రముఖులు చే విజేతలకు బహుమతి ప్రధానం ఉంటుందన్నారు. 4వ తేదీ శ్రీకృష్ణ జన్మాష్టమి రోజున మంగళహారతి, శ్రీ గోవింద శ్రీనివాస స్వామి వారి మహా అభిషేకం, సత్య గోపీనాథ్ దాసు ప్రభు జి చే భాగవతా ప్రవచనం, విశ్వశాంతి యజ్ఞం, అమృత స్నానం, ఉట్టి ఉత్సాహం జరుగుతా యన్నారు. రాత్రి పదిన్నర గంటలకు శ్రీ శ్రీ రాధా గోపీనాదులకు మహా కుంభాభిషేకం ఐదవ తేదీన శ్రీల ప్రభుపాదుల ఆవిర్భావచవం ఆవిర్భా వోత్సవం, వ్యాస పూజ మహాన్నదాన ప్రసాద వితరణ ఉంటుందన్నారు. జిల్లా ప్రజలందరూ, భక్తులు, పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని విజ్ఞప్తి చేశారు.

## టీడీపీ కార్యకర్త మృతి కి కుడుపూడి రూ.10 వేలు సహాయం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 25:**స్థానిక మూడవ వార్డు సుబ్బారావు పేటకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త బొమ్మనమైన అంతర్వేది మృతి చెందగా రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అంతర్వేది కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, తక్షణ సాయం రూ. 10,000 ఆర్థిక సహకారాన్ని అందించారు. ఆ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## శ్యామలాంబ పాఠశాల నిర్మాణానికి రూ.50 వేల విరాళం

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సమక్షంలో హై మాస్ట్ లైట్లను ప్రారంభం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 25:**ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న శ్యామలాంబ పాఠశాల నూతన భవన నిర్మాణానికి సి ఎస్ ఆర్ నిధుల కింద రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని పిల్లి తాతారావు అందించారు. ఈ మొత్తాన్ని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ 11వ డివిజన్ ఇంచార్జ్ కంటిపూడి రాజేంద్రప్రసాద్ కు అందజేశారు. అనంతరం అప్పారావు రోడ్డులోని కోదండ రామాలయం వద్ద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హై మాస్ట్ లైట్లను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

## రూ.18.93 లక్షలతో 21వ డివిజన్లో అభివృద్ధి పనులకు శ్రీకారం- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 25:** ఆరోగ్యకరమైన నగర నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, నగరంలో దశాబ్దాలుగా పేరుకుపోయిన డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. 21వ డివిజన్‌లోని గోదావరి గట్టు, రంగాచారి వారి వీధిలో రూ. 18,93 లక్షల వ్యయంతో ఔట్‌ఫాల్ డ్రైన్లకు క్రాస్ డ్రైన్లు, క్రాస్ కల్వర్టుల నిర్మాణ పనులకు మంగళ వారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాలుగా నగర డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని తెలిపారు. అనేక ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలు, నీటి నిల్వలు, డ్రైన్లపై బల్లలు లేకపోవడం వంటి సమస్యలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నా యన్నారు. గోదావరి గట్టు వెంబడి ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. ఈ ప్రభుత్వం లో మరమ్మతులు చేసి, కొత్తవి ఏర్పాటు చేసి తెరిచామని వివరించారు. పురాతన డ్రైనేజీన్ని పూడిక తొలగించి శుభ్రం చేసినట్లు తెలిపారు. గోదావరి గట్టు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను సితార హోటల్ వరకు అనుసంధానం చేసే చర్యలు చేపడు తున్నామన్నారు. రూ. 27 లక్షలతో డ్రైన్లపై బల్లలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థను సమగ్ర ప్రణాళికతో పనులు చేపడుతున్నామని, నీరు నిల్వ బయటకు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డ్రైనేజీలు, రోడ్లు, మేజర్ డ్రైన్లపై బల్లలు నిర్మిస్తున్నామన్నారు. ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించే మౌలిక వసతులకే ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రూ. 100 కోట్ల విలువైన పనులను ప్రారంభించామని, పుష్కరాలలో నగర డ్రైనేజీ వ్యవస్థను సమగ్రంగా ప్రక్షాళన చేసేందుకు సుమారు రూ. 140 కోట్లు వెచ్చించనున్నట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

## అడ్డతీగల మండలంలో 22 పంచాయతీలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల.. ఎంపీడీవో కుమార్..



**అడ్డతీగల, పెన్ పవర్, ఆగస్టు25;**అడ్డతీగల మండలంలో 22 గ్రామపంచాయతీలలో ఎస్సి, ఎస్టి, బీసీ ఓటర్ల ముసాయిదా జాబితాను మంగళవారం అన్ని గ్రామపంచాయతీ కేంద్రాలలో మరియు అడ్డతీగల మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు నోటీస్ బోర్డ్ లో ప్రచురించరు. ప్రతి గ్రామపంచాయతీలోనూ ఈ జాబితాను అందుబాటులో ఉంచడం జరిగిందని అడ్డతీగల ఎంపీడీవో ఏ.వి.వి కుమార్ తెలిపారు. ఈ జాబితా యందు అభ్యంతరాలు ఉన్నయెడల ఈనెల 28తేదీ లోగా తెలియపరచవచ్చని ఎంపీడీవో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా ఎస్సీ ,ఎస్టి ,బీసీ ఓటర్లను గుర్తిస్తున్నట్లు అడ్డతీగల ఎంపీడీవో కుమార్ తెలిపారు .

## గంగవరం హైవేపై చీకట్లు.. ప్రమాదాలకు ఆహ్వానం!

- నెలలుగా వెలగని హైవే లైట్లు -- తక్షణమే చర్యలు చేపట్టాలని జనసేన డిమాండ్



**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 25:** మండల కేంద్రం మీదుగా వెళ్లే జాతీయ రహదారిపై హైవే విద్యుత్ దీపాలు నెలలుగా వెలగకపోవడంతో రాత్రివేళ ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జనసేన మండల అధ్యక్షుడు కుంజం సిద్దు, గ్రామస్తుడు రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. హైవేపై రాత్రి వేళ తగిన వెలుతురు లేకపోవడంతో వాహనాల రాకపోకలు ప్రమాదకరంగా మారుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. హైవే లైట్లు వెలగకపోవడం వల్ల ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత జాతీయ రహదారి అధికారులు తక్షణమే స్పందించాలని వారు కోరారు. హైవేపై పనిచేయని విద్యుత్ దీపాలను పరిశీలించి, మరమ్మతులు చేపట్టి రాత్రివేళల్లో పూర్తిస్థాయిలో వెలుగులు ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నెలల తరబడి సమస్య కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని, ప్రమాదాలు చోటుచేసుకునే వరకు వేచి చూడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కుంజం సిద్దు, రాంబాబు కోరారు.

## అడ్డతీగల సామూహిక కేంద్రంలో కౌన్సిలర్ నారే.వాసు కుఆత్మీయ వీడ్కోలు, ఘన సన్మానం ..



**అడ్డతీగల, పెన్ పవర్, ఆగస్ట్ 25;** అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో గత రెండు సంవత్సరాలుగా తన సేవలను అందిస్తూ, ఎంతోమంది రోగులకు కౌన్సెలింగ్ ద్వారా అండగా నిలిచిన కౌన్సిలర్ నారే. వాసునీ మంగళవారం ఆసుపత్రి వైద్యులు మరియు సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు.

వాసు రాజమండ్రి ప్రభుత్వ టీచింగ్ హాస్పిటల్‌లోని డీ-అడిక్షన్ సెంటర్‌లో ఉద్యోగం లభించిన సందర్భంగా ఈ వీడ్కోలు కార్యక్రమం ఆసుపత్రి సిబ్బంది నిర్వహించారు.గత రెండు సంవత్సరాలుగా అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆయన అందించిన సేవలు, రోగుల పట్ల వాసు చూపిన ఆప్యాయత, అంకితభావం మరియు సహకారం ఎప్పటికీ మరువలేనివి అని డాక్టర్ మహేష్ రెడ్డి అన్నారు.కొత్త గా చేపట్టే బాధ్యతల్లో కూడా ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, సమాజానికి మరెన్నో సేవలు అందించాలని, అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మరియు సిబ్బంది అన్నారు. అనంతరం కౌన్సిలర్ వాసును ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com